గురువారం

21-03-2024

విజయవాడ ప్రచురణ

సంపుటి : 72, సంచిక : 269

పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

అఫ్ఘాన్‌లో తెరుచుకున్న బడులు

కాబూల్: తాలిబన్ల పాలనలో అఫ్గానిస్థాన్‌లో బాలికలు, మహిళల వెతలు వర్ణనాతీతం. అఫ్ఘాన్ కేలండర్ ప్రకారం కొత్త సంవత్సరాదికి ఒకరోజు ముందు విద్యా సంవత్సరం ప్రారంభమవుతుంది. ఇదే క్రమంలో అన్ని ప్రావిన్సుల్లో బడి గంట మోగింది. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు కూడా తెరుచుకున్నాయి.

కానీ బాలికలపై ఆంక్షల వేళ వారు వరుసగా మూడో ఏడాది చదువుకు దూరం కావల్సి వస్తోంది. 2022 మార్చిలో తాలిబన్ ప్రభుత్వం బాలికల ఉన్నతవిద్యపై నిషేధం విధించింది.

సార్వత్రిక సమరం షురూ

- తొలిదశ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల
- నామినేషన్లు ప్రారంభం... 27 చివరితేదీ
- ఏప్రిల్ 19న 102 ఎంపీ స్థానాలకు పోలింగ్

న్యూఢిల్లీ:

దేశంలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. తొలి విడతలో భాగంగా 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 102 నియోజకవర్గాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఫలితంగా నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. ఈ నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ ఈనెల 27 కాగా, 28న నామినేషన్ల పరిశీలన జరగనుండగా... మార్చి 30 వరకు నామినేషన్లు ఉపసంహరించుకోవచ్చు. ఏప్రిల్ 19న వివిధ రాష్ట్రాల్లోని 102 నియోజకవర్గాల్లో తొలి విడత పోలింగ్ జరగనుంది. ఇందులో తమిళనాడులో 39 నియోజకవర్గాలుండగా... రాజస్థాన్-12, ఉత్తర్‌ప్రదేశ్-8, మధ్యప్రదేశ్-6, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, అసోంలో ఐదేసి స్థానాలకు తొలి విడత పోలింగ్ జరగనుంది. అలాగే బీహార్‌లో 4, పశ్చిమబెంగాల్-3, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయాల్లో రెండేసి, చత్తీస్‌గఢ్, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, అండమాన్ నికోబార్, జమ్మూకశ్మీర్, లక్షద్వీప్, పుదుచ్చేరీలో ఒక్కో స్థానానికి పోలింగ్ జరగనుంది. కాగా మిగతా రాష్ట్రాల్లో నామినేషన్ల పరిశీలన మార్చి 28న ఉండగా, బీహార్‌లో మాత్రం ఈ నెల 30న ఉండనుంది. అభ్యర్థులు ఏప్రిల్2 వరకు నామినేషన్లను ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది. ఇక ఈ 18వ లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 19 జరగనుండగా, ఆ తర్వాత ఆరు దశల్లో ఏప్రిల్ 26, మే 7, మే 13, మే 20, మే 25, జూన్ 1న ఎన్నికలు జరుగుతాయి. జూన్4న ఓట్లు లెక్కింపు ఉంటుంది. కాగా అరుణాచల్ ప్రదేశ్‌లోని 60 అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కార్యాలయం వేర్వేరు గెజిట్ నోటిఫికేషన్‌లను విడుదల చేసింది. 2019 ఎన్నికల్లో అధికార బీజేపీ రెండు లోక్‌సభ స్థానాలను గెలుచుకోగా...

- మిగతా 2 లో

జగన్‌తో అమీతుమీ!

- కడప లోక్‌సభకు చెల్లెమ్మ
- పులివెందుల అసెంబ్లీకి పిన్నమ్మ
- అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్?
- ప్రత్యక్ష పోరుకు కుటుంబసభ్యులు సిద్ధం
- వివేకా హత్య చుట్టూ కడప రాజకీయం
- నేడు కాంగ్రెస్ కార్యకర్తలతో షర్మిల భేటీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:

గత శాసనసభ ఎన్నికల్లో వైసీపీ విజయానికి దోహదపడిన వైఎస్ వివేకానందరెడ్డి హత్య, ఈసారి అదే అంశం ఆ పార్టీకి ప్రతిబంధకంగా మారబోతోంది. వివేక హత్యకు టీడీపీ అధినేత చంద్రబాబే కారణమంటూ ఆరోపించి ఓటర్ల సానుభూతి పొందిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి... ఆ హత్యకు కారకులెవరో ఐదేళ్లుగా తేల్చలేకపోయారు. ఈ హత్యపై సీబీఐ దర్యాప్తు కోరిన జగన్... ఆ తర్వాత అవసరం లేదని చెప్పారు. అంతేగాక సీబీఐ దర్యాప్తు చేపట్టి నిందితులుగా పేర్కొన్న వారికి కూడా సీఎం జగన్ అండగా నిలుస్తున్నారని వివేక కుమార్తె సునీత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసులో దోషులెవరో తేల్చాలంటూ సునీత ఐదేళ్లుగా పోరాడుతున్నారు. ఆమెకు సీఎం జగన్ సొంత చెల్లెలు షర్మిల సైతం అండగా నిలిచారు. ఇటీవల వివేకానందరెడ్డి సంస్మరణ సభలో వీరిద్దరూ ప్రజాకోర్టులోనే న్యాయం కోరతామని శపథం చేశారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేయవద్దని ఇదే వేదికగా రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో వివేక కేసులో కీలక నిందితుడిగా ఉన్న అవినాశ్ రెడ్డిని వైసీపీ అధిష్ఠానం మళ్లీ కడప ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడంతో ఆయనపై షర్మిల కానీ, సునీత కానీ పోటీ చేస్తారనే ప్రచారం కొంతకాలంగా సాగుతోంది. దీనితోపాటు కడప నుంచి పోటీ చేస్తారా ? లేక విశాఖ నుంచి చేస్తారా ? అనే చర్చ కూడా జరుగుతోంది. షర్మిల సొంత జిల్లా కడప నుంచి పోటీచేస్తేనే తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉంటుందని స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నేతలు ఒత్తిడి చేస్తున్నారు. ఏఐసీసీ నేతలు కూడా అదే అభిప్రాయం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో గురువారం కడప జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్లు, ముఖ్య నేతలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లతో షర్మిల సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో కడప నుంచి షర్మిల పోటీపై అధికారికంగా ప్రకటన చేసే అవకాశం ఉందని కాంగ్రెస్ శ్రేణులు భావిస్తున్నాయి.

వైఎస్ షర్మిల పీసీసీ అధ్యక్ష బాధ్యతలు తీసుకున్న తర్వాత పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు తనవంతు ప్రయత్నం చేస్తున్నారు. దీనిలో భాగంగా ఆమె రాష్ట్రవ్యాప్తంగా సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. తాజాగా ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో తొలుత ఆమె విశాఖ నుంచి రంగంలోకి దిగాలని, వివేక సతీమణి సౌభాగ్యమ్మను కడప ఎంపీగా పోటీ చేయించాలని ఆలోచన చేశారు. దీనిలో భాగంగానే విశాఖలో ఇటీవల ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసింది. దానికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని కూడా ఆహ్వానించారు. 2014 ఎన్నికల్లో షర్మిల తల్లి వైఎస్ విజయమ్మ విశాఖ నుంచి వైసీపీ ఎంపీగా పోటీచేసి ఓడిపోయారు. గత అనుభవాల దృష్ట్యా షర్మిల విశాఖ కంటే సొంత జిల్లా కడప నుంచి పోటీచేయాలని పార్టీ సీనియర్లు కోరినట్లు తెలుస్తోంది. అధిష్ఠానం సైతం కడప నుంచి పోటీ చేయాలని కోరడంతో ఆమె అంగీకరించినట్లు సమాచారం. కడపకు చెందిన పార్టీ నేతలతో షర్మిల గురువారం సమావేశమవుతుండటంతో ఆమె కడప నుంచి పోటీ చేయవచ్చనే అంచనాలకు బలం చేకూరినట్లైంది.

షర్మిల కడప నుంచి బరిలోకి దిగితే పోరు ఆసక్తికరంగా మారే అవకాశం ఉంది. వివేక సతీమణిని పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దింపాలని స్థానిక కాంగ్రెస్ నేతలు పీసీసీ అధినేతపై ఒత్తిడి పెంచుతున్నారు. వివేక హత్య తర్వాత సీఎం జగన్, ఎంపీ అవినాశ్‌రెడ్డిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, అందువల్ల పులివెందుల నుంచి సౌభాగ్యమ్మ, కడప ఎంపీకి షర్మిల పోటీ చేస్తే విజయం సునాయాసమవుతుందని కాంగ్రెస్ పార్టీ నేతలు విశ్లేషిస్తున్నారు. పీసీసీ అధినేత దీనిపై ఏ నిర్ణయం తీసుకుంటారనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

లోక్‌సభకు సీపీఐ తొలి జాబితా

తమిళనాడులో 2, మహారాష్ట్రలో ఒక స్థానానికి అభ్యర్థుల ఖరారు

న్యూఢిల్లీ:

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) తొలి జాబితాను విడుదల చేసింది. తమిళనాడులో రెండు, మహారాష్ట్రలో ఒక లోక్‌సభ స్థానానికి పోటీ చేయనున్న ముగ్గురు అభ్యర్థులతో కూడిన జాబితాను సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా బుధవారం ప్రకటించారు. తమిళనాడులో అధికార డీఎంకేతో పొత్తులో భాగంగా తిరుప్పూర్ నుంచి కె.సుబ్బరాయన్, నాగపట్నం నుంచి వి.సెల్వరాజ్, అలాగే మహారాష్ట్రలోని పర్భాని లోక్‌సభ స్థానం నుంచి రాజన్ రామచంద్ర క్షీర్‌సాగర్‌ను పోటీలో నిలపాలని సీపీఐ జాతీయ కార్యవర్గం నిర్ణయించింది.

'ఉచిత హామీల'పై నేడు సుప్రీం విచారణ

న్యూఢిల్లీ:

ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఉచిత హామీలు ఇస్తున్న తీరుపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని విచారించేందుకు భారత సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. సార్వత్రిక ఎన్నికలకు తొలి నోటిఫికేషన్ విడుదలైన రోజే ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. గురువారం నాటి విచారణ జాబితాలో దీనిని చేరుస్తామని తెలిపింది. ఉచిత హామీలు ప్రకటించే పార్టీల గుర్తులు, రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసేందుకు ఎన్నికల సంఘం తన అధికారాలు ఉపయోగించేలా ఆదేశించాలని పిటిషనర్ సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చే వాగ్దానాలపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం పరిశీలించింది. లోక్‌సభ ఎన్నికల కంటే ముందే దీనిపై విచారణ జరపాలని పిటిషనర్ తరఫున హాజరైన సుప్రీంకోర్టు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఈసీ అనుమతిస్తేనే డీఎస్సీ

- పరీక్ష వాయిదా వేయాలని, వద్దని వెయ్యికి పైగా ఫిర్యాదులు
- వలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొంటే కఠిన చర్యలు
- 46 మంది వలంటీర్లు, ఒప్పంద ఉద్యోగులపై వేటు
- ఎన్నికల సంఘం ప్రధాన అధికారి ముకేశ్ కుమార్ మీనా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:

ఈనెల 30 నుంచి జరగనున్న డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలని, మరికొందరు వద్దని కోరుతూ ఇప్పటివరకు వెయ్యికి పైగా ఫిర్యాదులు వచ్చాయని, దీనిపై ఈసీ నుంచి అనుమతి వస్తేనే డీఎస్సీ పరీక్ష జరుగుతుందని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి

- మిగతా 2 లో

ఆపరేషన్ పిఠాపురం

- పవన్ అయోమయం
- ఎమ్మెల్యే నుంచి ఎంపీగా మార్పు?
- వైసిపి అష్టదిగ్బంధం
- నేతలకు జగన్ దిశానిర్దేశం
- జనసేన శ్రేణుల కలవరం
- అభ్యర్థుల వెల్లడిలో వెనుకబాటు
- వైసీపీలో చేరిన పిఠాపురం జనసేన మాజీ ఇన్‌ఛార్జి శేషుకుమారి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:

జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాజకీయ ప్రస్థానం అయోమయంగా మారింది. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఆయన తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం అసెంబ్లీ నుంచి బరిలో ఉంటానని ప్రకటించారు. తాజాగా పవన్ అవసరమైతే, బీజేపీ నేతలు సూచిస్తే కాకినాడ ఎంపీగా పోటీ చేస్తాననంటూ వెల్లడించారు. ఇవి జనసేన శ్రేణులను అయోమయానికి గురిచేస్తున్నాయి. ఇప్పటికే టీడీపీ పొత్తులో భాగంగా అధికార పంపిణీ, అవసరమైన సీట్ల సాధనలో విఫలమయ్యారన్న విమర్శలున్నాయి. తొలుత టీడీపీ, జనసేన పొత్తుకు దిగితే, జనసేనకు 40 నుంచి 60 అసెంబ్లీ సీట్లు వస్తాయని ఆ పార్టీ నేతలు భావించారు. అందుకు అనుగుణంగా చాలా నియోజక వర్గాల్లో నేతలు పార్టీ కార్యక్రమాలు నిర్వహించారు. పొత్తులో భాగంగా తొలుత 24 అసెంబ్లీ, 3 ఎంపీ స్థానాలు తమకు వచ్చినట్లు పవన్ కల్యాణ్ ప్రకటించి, ఆ తర్వాత బీజేపీ పొత్తుతో అవి కాస్తా 21 అసెంబ్లీ, 2 ఎంపీ స్థానాలకు కుదించుకుపోయాయి. ఇవి జనసేన నేతలకు మింగుడు పడటం లేదు. చాలా మంది అసంతృప్తితో ఉండి పార్టీని వీడారు. జనసేన పార్టీతో పవన్ సామాజిక వర్గానికి చెందిన కాపులంతా ఏకతాటిపైకి వస్తారని భావించినప్పటికీ,

- మిగతా 2 లో

ఈవీఎంలే మోదీ విజయ రహస్యం

- అవి తారుమారు కాకుండా అరికట్టగలిగితే '400 పార్' కల్ల
- మోదీ గద్దె దిగడం తథ్యం
- అందుకోసం మా వంతు కృషి చేస్తాం: యూపీలోని చోర్డిహా గ్రామ ప్రజలు

న్యూఢిల్లీ:

దేశంలో ఎన్నికల నగారా మోగింది. పోలింగ్ తేదీల ప్రకటన వెలువడింది. బీజేపీ మూడోసారి అధికారం కోసం తంటాలు పడుతోంది. '400 పార్'(400 సీట్లు) నినాదంతో ముందుకెళుతోంది. అయితే బీజేపీకి కంచుకోటగా భావించే ఉత్తరప్రదేశ్‌లోని ఓ గ్రామం... కమల దళానికి చుక్కలు చూపించేందుకు సిద్ధమైంది. 400కు మించి స్థానాల్లో గెలవాలనే బీజేపీ ఆశలు గల్లంతు చేయాల్సిందేనని నొక్కిచెబుతోంది. మోదీని గద్దె దించితేనే సమస్యలు పరిష్కారమవుతాయని నమ్ముతోంది. అదే ఉత్తరప్రదేశ్, సాలంపూర్ పార్లమెంటరీ నియోజకర్గం పరిధిలోని దళిత గ్రామం చోర్డిహా. ఇక్కడి ప్రజలు మోదీపై గుర్రుగా ఉన్నారు. ఆయనను ఎలాగైనా అధికారం నుంచి తప్పించాలని భావిస్తున్నారు. ఈవీఎంలే మోదీ విజయ రహస్యమని, ఈవీఎంలు తారుమారు కాకుండా అరికట్టగలిగితే బీజేపీ '400 పార్' కల సాకారం కాబోదని, మోదీ గద్దె దిగడం

- మిగతా 2 లో

సీఏఏ, యూసీసీ రద్దు చేస్తాం

- మహిళలకు ప్రతినెలా రూ.వెయ్యి
- చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్
- రూ.500కే వంట గ్యాస్ సిలిండర్
- తమిళనాడు విద్యార్థులకు 'నీట్' మినహాయింపు
- ఎన్నికల మేనిఫెస్టోలో డీఎంకే హామీ

2లో

'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)తో పాటు జమిలి ఎన్నికలు, ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) ప్రణాళికలను రద్దు చేస్తామని, కొత్త జాతీయ విద్యా విధానం 2020ని తొలగిస్తామని, తమిళనాడు విద్యార్థులకు నీట్ ప్రవేశ పరీక్ష నుంచి మినహాయింపు ఇస్తామని, పార్లమెంటు, శాసనసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను తక్షణమే అమలు చేస్తామని పాలక డీఎంకే హామీ ఇచ్చింది.

కేంద్ర మంత్రి శోభపై ఈసీ ఆగ్రహం

న్యూఢిల్లీ:

కేంద్రమంత్రి, బీజేపీ నేత శోభా కరంద్లాజేపై ఎన్నికల సంఘం కన్నెర్ర చేసింది. ఆమెపై తక్షణ చర్యలు తీసుకోవాలని కర్నాటక ప్రధాన ఎన్నికల అధికారికి ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంలో 48 గంటల్లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. మార్చి1న బెంగళూరులోని రామేశ్వర కేఫ్‌లో పేలుడుకు కారణమైన నిందితుడు తమిళనాడు వ్యక్తి అని కరంద్లాజే ఆరోపించడంపై డీఎంకే తీవ్రంగా స్పందించింది. ఆమెపై చర్యలు

- మిగతా 2 లో

మరో అడుగు ముందుకు...

- ఫ్లోరిడా, ఓహాయో ప్రైమరీల్లో ట్రంప్, బైడెన్ గెలుపు
- అరిజోనాలో బైడెన్‌కు బదులు విలియమ్సన్‌కు డెమొక్రాట్ల మద్దతు

వాషింగ్టన్: అమెరికా ప్రస్తుత, మాజీ అధ్యక్షుడు జో బైడెన్, డొనాల్డ్ ట్రంప్ ప్రైమరీ ఎన్నికల్లో సత్తా చాటుతున్నారు. వరుస విజయాలతో దూసుకెళుతున్నారు. తాజాగా ఫ్లోరిడా, ఓహాయోలోనూ విజయం సాధించి అధ్యక్ష రేసుకు మరో అడుగు చేరువయ్యారు. రిపబ్లికన్ పార్టీ తరపున డొనాల్డ్ ట్రంప్, డెమొక్రాటిక్ పార్టీ తరపున జో బైడెన్ మధ్య నవంబరులో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో ప్రధానంగా పోటీ ఉంటుంది. ఫ్లోరిడా, ఒహాయో రాష్ట్రాల్లో ట్రంప్, బైడెన్ విజేతలుగా నిలిచారు. ఫ్లోరిడా రిపబ్లికన్ ప్రైమరీలో ట్రంప్‌కు మద్దతు లభించగా, డెమొక్రాట్లకు ఒక్క సీటు రాలేదు. ప్రచారం నుంచి తప్పుకున్నప్పటికీ నిక్కీ హేలీని ఓహాయో, ఇల్లినాయిస్ వంటి రాష్ట్రాల్లో బ్యాలెట్‌లో ఉంచారు. ప్రతినిధుల మద్దతును కూడకట్టుకునే క్రమంలో ట్రంప్, బైడెన్ ఎవరికి వారు దూసుకెళుతున్నారు. ఇద్దరూ ఎన్నికల తుది ఫలితాలను ప్రభావితం చేసే స్వింగ్ రాష్ట్రాలపై దృష్టి పెట్టారు. ప్రచారాన్ని పెంచారు. ట్రంప్ ఇమిగ్రేషన్ విధానాలపై జో బైడెన్ విమర్శలు గుప్పించారు. యువత, లాటినో కమ్యూనిటీలను ఆకర్షించేలా బైడెన్ తన ప్రచార వ్యూహాలను రూపొందించుకున్నారు. వలసలు, అబార్షన్లపై ట్రంప్ విధానాలను విమర్శించడానికి బైడెన్ యత్నిస్తున్నారు. ఫ్లోటింగ్ ఓటర్లను గెలుచుకోవడంలో ఈ వ్యూహం ప్రధాన పాత్ర పోషిస్తుందనే నమ్మకంతో బైడెన్ ఉన్నారు. ఇదిలావుంటే అరిజోనాలో అధ్యక్ష ఎన్నికల్లో సెల్ఫ్ హెల్ప్ బుక్స్ రచయిత మరియానే విలియమ్సన్‌కు డెమొక్రటిక్ ఓటర్లు మద్దతు పలికారు. బైడెన్‌కు విరుద్ధంగా, విలియమ్సన్ శాశ్వత శాంతి కోసం పిలుపునిచ్చారు. ఇది విదేశాంగ విధాన దృక్పథాలను పరిగణనలోకి తీసుకునేలా ఉండటంతో ప్రజలను ఆకర్షిస్తోంది. ఓహాయోలో, పలస్తీనా అనుకూల మద్దతుదారులు బ్యాలెట్‌ను ఖాళీగా ఉంచి 'లీవ్ ఇట్ బ్లాంక్' విధానం ద్వారా గాజా యుద్ధం విషయంలో బైడెన్ విధానాలపై నిరసన తెలపాలని పిలుపిచ్చారు. మరోవైపు ట్రంప్‌పై అనేక కేసులు విచారణలో ఉన్నాయి. న్యాయపరమైన సమస్యలు, వివాదాల నడుమ అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారాన్ని ఆయన కొనసాగిస్తున్నారు. 2020లో ఎన్నికలు రద్దు చేయడానికి కుట్ర చేశారనే కేసును కొట్టివేయాలని సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై సర్వోన్నత న్యాయస్థానం విచారణ చేపట్టాల్సి ఉంది.

హెచ్ 1బీ వీసా దరఖాస్తుకు 22 వరకే గడువు

వాషింగ్టన్: హెచ్ 1బీ వీసా దరఖాస్తు పెట్టుకోవడానికి ఈనెల 22వ తేదీతో గడువు ముగుస్తుంది. ఈ వీసా కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ మార్చి 6న మొదలైంది. విదేశీ ఉద్యోగులు అమెరికాలో పనిచేయడానికి అనుమతించే హెచ్ 1బీ వీసా కోసం ఐ-129 ఫారం, ప్రీమియం ప్రాసెసింగ్‌కు ఐ-907 ఫారాన్ని నింపాలి. ఇవి మైయు.ఎస్.సి.ఐ.ఎస్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. హెచ్1బీ క్యాప్ పిటిషన్లకు ఆన్‌లైన్‌లో ఫారాల దాఖలు ప్రక్రియ ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానున్నది. ఏటా 65వేల హెచ్1బీ వీసాలు మంజూరవుతాయి. మరో 20వేల వీసాలను అమెరికాలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసిన వారికి కేటాయిస్తారు. హెచ్ 1బీ వీసాలు పొందేవారిలో అత్యధికంగా భారత్, చైనా టెక్కీలే ఉంటారు.

జాబిల్లిపైకి చైనా 'క్యూకియాంగ్-2'

చంద్రుడి అవతలి పక్క నుంచి కమ్యూనికేషన్ ఏర్పాటుకు యత్నం

ఈ ఏడాది 100 అంతరిక్ష మిషన్ల లక్ష్యం

బీజింగ్: చైనా అంతరిక్ష పరిశోధనలు, ప్రయోగాల్లో వేగాన్ని పెంచింది. ఈ ఏడాది మొత్తం 100 అంతరిక్ష మిషన్లకు శ్రీకారం చుట్టింది. వచ్చే ఏడాది మేలో చేపట్టబోయే ఛాంగీ మిషన్ కోసం సన్నాహాలు చేస్తోంది. ఇదే క్రమంలో బుధవారం ఉదయం చంద్రుడిపైకి క్యూకియాన్-2 ఉపగ్రహాన్ని పంపింది. లాంగ్ మార్చ్ 8 రాకెట్ ద్వారా హైనాన్స్ ప్రావిన్సు నుంచి ఈ ప్రయోగం జరిగిందని, చంద్రుడిపై భవిష్యత్ ప్రయోగాల కోసం అవసరమైన సమాచారాన్ని సేకరించేందుకు ఈ మిషన్ చేపట్టామని చైనా జాతీయ అంతరిక్ష కేంద్రం వెల్లడించింది. చంద్రుడి అవతల పక్కకు ఉపగ్రహాన్ని పంపడం... కమ్యూనికేషన్ నెలకొల్పేందుకు యత్నిస్తుండటంతో ఇది అసాధారణ ప్రయోగంగా చెప్పబడుతోంది. అయితే క్యూకియావ్-2 చంద్రుడి చుట్టూ పరిభ్రమిస్తూ.. వచ్చే మే నెలలో చేపట్టనున్న ఛాంగీ-6 మిషన్ నుంచి సంకేతాలను భూమిపైకి చేరవేస్తుంది. చాంగీ ప్రాజెక్టులో భాగంగా చంద్రుడి అవతలి వైపు ఉన్న మట్టి, ఇతర ఖనిజాల నమూనాలను చైనా సేకరించనుంది. 2026లో ప్రయోగించే లక్ష్యాన్ని నిర్దేశించుకున్న చాంగీ-7, 2028లోని చాంగీ-8కు కూడా ఈ ఉపగ్రహం దోహదమవుతుంది. చంద్రుడిపై మానవసహిత యాత్రలకు, ఇతర గ్రహాలపై కార్యకలాపాల నిర్వహణకు కమ్యూనికేషన్స్‌ను చైనా దీని నుంచే నిర్వహించనుంది. క్యూకియాన్ జీవితకాలం ఎనిమిదేళ్లు.తాజా ప్రయోగంలోనే తియాండు-1,2 అనే మినీ ఉపగ్రహాలను కూడా ప్రయోగించారు. కమ్యూనికేషన్ నెట్‌వర్క్ సమూహాన్ని ఏర్పాటు సాధ్యాసాధ్యాలను వీటి ద్వారా చైనా పరీక్షించనుంది. చంద్రుడి దక్షిణ ధ్రువంలో నిర్మించ తలపెట్టిన ల్యాబొరేటరీకి ఇవి నేవిగేషన్, రిమోట్‌సెన్సింగ్, కమ్యూనికేషన్ సేవలను అందిస్తాయి.

ఈవీఎంలే మోదీ విజయ రహస్యం

(మొదటిపేజీ తరువాయి)

తథ్యమని, అందుకోసం తమ వంతు కృషి చేస్తామని అంటున్నారు. బీజేపీ మంత్రాంగానికి చెక్ పెట్టేందుకు సంకల్పించారు.

'పోలింగ్ రోజు మా బూత్‌లకు వస్తే అసలు విషయం తెలుస్తుంది. ఈవీఎంలే మోదీ విజయ రహస్యం. మాలో ఒక్కరు కూడా బీజేపీకి ఓటు వేయరు. కానీ ఫలితాలు పూర్తి భిన్నంగా వెలువడతాయి. పోలింగ్ అధికారులకు ఫిర్యాదు చేయడం వ్యర్థం. వారు కూడా బీజేపీ తొత్తులే' అని గ్రామ ప్రజలు అన్నారు. మధ్యాహ్నం 12గంటల లోపు ఓటు వేస్తే వాటిని తారుమారు చేసే అవకాశం ఉండదని ఒకరు చెప్పగా...అలాగే చేసిచూద్దామని మిగతావారన్నారు. 'మధ్యాహ్నం 12 గంటల్లోగా ఓట్లు వేద్దాం. ఆ తర్వాత ఈవీఎంలను సీల్ చేసి వాటిని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించమని ప్రిసైడింగ్ అధికారులను కోరుదాం' అని స్థానికుడు సీతారాం అన్నారు. పోలింగ్ పూర్తి అయిన తర్వాత కూడా అధికారులు పొద్దుపోయే వరకు పోలింగ్ కేంద్రాల్లో ఎందుకు ఉండాలి? ఆ సమయంలో ఈవీఎంలు తారుమారవుతాయన్నారు. ఈవీఎంలకు సీల్ వేసి... వాటిని ప్యాక్ చేసేంత వరకు బూత్ వద్ద నుంచి కదలకూడదని ఇక్కడి ప్రజలు నిర్ణయించుకున్నారు. మోదీపై వీరి కోపానికి వేర్వేరు కారణాలు ఉన్నాయి. ఓ గ్రామస్తుడు మాట్లాడుతూ 'మీకు ఇక్కడి పరిస్థితులు ఏమి తెలుస్తాయి. మీరు బయట నుంచి వస్తారు. అవాస్తవాల ఆధారంగా ప్రశ్నలు వేస్తారు. పక్కనే పాట్నా గ్రామానికి చెందిన ఓ యువకుడు మంచి జానపద గాయకుడు. ఓ పాట పాడి యూట్యూబ్‌లో పెట్టాడు. వెంటనే అతనిని పోలీసులు అరెస్టు చేసి జైల్లో పెట్టారు. పోలీసులు తరచూ వచ్చి జానపద గాయకుల కోసం వెతుకుతుంటారు' అని అన్నారు. పోలీసు యంత్రాంగం యోగి ప్రభుత్వం పరిధిలోకి వస్తుంది కదా... అంటే యోగి ఉండేది మోదీ కిందే కదా అని వారు అన్నారు. మోదీ పనైపోతే యోగి కూడా ఉండరన్నారు. సార్వత్రిక ఎన్నికల వేళ మోదీ తప్ప ఎవరి గురించి ఆలోచించాల్సిన పనిలేదని నొక్కిచెప్పారు. ఎన్నికల బాండ్ల వివాదం, సుప్రీంకోర్టు తీర్పు గురించీ వీరికి తెలుసు. మోదీని గద్దె దించితే తప్ప ఇలాంటి సమస్యలకు పరిష్కారం లభించబోదని నమ్మకంగా చెప్పారు. 'సొంత మనుషుల ద్వారా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను మోదీ స్వాధీనం చేసుకున్నారు. రఘురామ్ రాజన్‌ను తొలగించి...తన వారిని బ్యాంకుల్లో నియమించారు. జాతీయస్థాయిలో జరిగే అన్ని పరిణామాలు మాకు తెలుసు. మొబైల్ ఫోన్ల ద్వారా యూట్యూబ్, ఫేస్‌బుక్ తదితర మాధ్యమాలలో దేశంలో ఏం జరుగుతుందో తెలుసుకుంటుంటాం' అని వారు చెప్పారు. మోదీకి కాకపోతే ఎవరికి ఓటు వేస్తారంటే మాయావతి పేరు చెప్పారు. కాంగ్రెస్-సమాజ్‌వాదీ పార్టీ కూటమితో కలిసి ఆమె ఎన్నికలకు వెళతారని ఆకాంక్షించారు. సమయం చాలా ఉన్నది కాబట్టి పొత్తుల్లో మార్పులు జరగవచ్చన్నారు. ఏదిఏమైనా తమ ఆందోళన మొత్తం ఈవీఎంలపైనే అని అన్నారు. మోదీని గద్దె దించేందుకు ఇవొక్కటే మార్గమని స్థానికులు నొక్కిచెప్పారు.

నేడు సుప్రీం విచారణ

(మొదటిపేజీ తరువాయి)

సీనియర్ న్యాయవాది విజయ్ హన్సారియా చేసిన విజ్ఞప్తిని న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. ఇది ముఖ్యమైన అంశమేనని, దీనిని గురువారం జాబితాలో చేరుస్తామని త్రిసభ్య ధర్మాసనం తెలిపింది. రాజకీయ పార్టీలు ఇచ్చే వాగ్దానాలపై చర్యలు తీసుకునేలా ఈసీని ఆదేశించాలంటూ న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేశారు. ప్రభుత్వ నిధులతో చేపట్టే పథకాలపై రాజకీయ పార్టీలు ఇచ్చే అసంబద్ధ హామీలు ఓటర్లను ప్రభావితం చేస్తాయన్నారు. ఇవి నిష్పక్షపాత ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగిస్తాయన్నారు. రాజకీయలబ్ధి పొందే ఉద్దేశంతో ఇచ్చే ఇటువంటి ప్రజాకర్షక చర్యలు రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని, వీటిపై నిషేధం విధించాలని అందులో పేర్కొన్నారు. వీటిపై ఎన్నికల సంఘం తగు చర్యలు తీసుకునేలా ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు.

ఈసీ అనుమతిస్తేనే డీఎస్సీ

(మొదటిపేజీ తరువాయి)

(సీఈవో) ముఖేశ్ కుమార్ మీనా స్పష్టం చేశారు. ఈ నెల 16న ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన తదుపరి రాష్ట్రంలో అమలవుతున్న ఎన్నికల ప్రవర్తనా నియమావళి సందర్భంగా తీసుకున్న చర్యలను బుధవారం రాష్ట్ర సచివాలయం ఎన్నికల మీడియా కేంద్రంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన వివరించారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన గత మూడు రోజుల్లో ఎంసీసీ ఉల్లంఘనలపై 385 ఎఫ్ఐఆర్‌లు దాఖలయ్యాయని, రూ.3.39 కోట్ల విలువైన నగదు, మద్యం, డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రాష్ట్రంలో హింస రహిత, రీ పోలింగ్‌కు అవకాశం లేని ఎన్నికలే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. అయితే ఈ మధ్య కాలంలో గిద్దలూరు, ఆళ్లగడ్డ, మాచర్లలో కొన్ని హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. ఇటువంటి హింసాత్మక సంఘటనలకు దారితీసిన కారణాలను, చట్టపరంగా తీసుకున్న చర్యలను వివరించేందుకు సంబంధిత జిల్లాల ఎస్పీలు రేపు తమ కార్యాలయానికి వస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు పరుస్తున్నామని, ఎంసీసీ ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు.

రాష్ట్రంలో 144 సెక్షన్ అమలు అవుతోందని, ఎలాంటి కార్యక్రమానికైనా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సువిధా యాప్ ద్వారా అనుమతులు తీసుకోవచ్చని, ఈ యాప్ ద్వారా ఇప్పటి వరకూ 392 దరఖాస్తులు అందాయని, వాటిలో 10 తమ పరిధిలోవి కాగా మిగిలినవి జిల్లా ఎన్నికల అధికారుల పరిధిలో ఉన్నట్లు తెలిపారు. ఎంసీసీ ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులను సీ విజిల్ యాప్ ద్వారా నమోదు చేసుకున్న 100 నిముషాల్లో చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇందుకు దాదాపు 1,173 ఫ్లయింగ్ స్క్వాడ్లు పని చేస్తున్నాయని, ఇప్పటి వరకు 1,307 ఫిర్యాదులు అందాయని, వాటిలో 74 శాతం పరిష్కరించినట్లు తెలిపారు. సి-విజిల్ ఫిర్యాదుల్లో 95 శాతం మేర పరిష్కరించే లక్ష్యంతో ఉన్నట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, వలంటీర్లు రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనడం, వారితో సాన్నిహిత్యంగా ఉండటం ఎంసీసీ నియమాలకు విరుద్ధమన్నారు. ఫిర్యాదులు అందిన 46 మంది వలంటీర్లను, కాంట్రాక్టు ఉద్యోగులను విధుల నుంచి తొలగించామని, కొందరిపై క్రిమినల్ కేసులు కూడా పెట్టామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు సీఈవో ఎం.ఎన్.హరేంద్ర ప్రసాద్, సి-విజిల్ యాప్ వినియోగం, ఆ యాప్ ద్వారా అందే ఫిర్యాదులపై తీసుకునే తక్షణ చర్యలను వివరించారు. అదనపు సీఈవో పి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ పిలుపు

ఎన్డీఏను ఓడించండి...'ఇండియా'ను గెలిపించండి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి పిలుపునిచ్చింది. విజయవాడలో గొల్లపూడి జోశ్యభట్ల సత్యనారాయణ భవన్‌లో బుధవారం ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర సమితి సమావేశం ఈ మేరకు తీర్మానించింది. తొలుత గత కౌన్సిల్ నుంచి నేటి కౌన్సిల్ వరకు మరణించిన కార్మిక నాయకులకు సమావేశం ప్రగాఢ సంతాపం తెలిపింది.అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబించి కార్మిక వర్గానికి తీవ్ర నష్టం కలగజేశాయని మండిపడ్డారు. ముఖ్యంగా ప్రధాని మోదీ 44కార్మిక చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్‌లు ప్రవేశపెట్టి కార్మికుల హక్కులు కాలరాశారని, ఆంధ్ర రాష్ట్రానికి సంబంధించి విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు పూనుకున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ కార్మిక వర్గానికి ఉపాధి లేకుండా ఉద్యోగ భద్రత లేకుండా చేశారని ధ్వజమెత్తారు. ఈ అంశాలపై ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా కార్మిక వర్గం అనేక పోరాటాలు సాగించిందని, ముఖ్యంగా రైతులు, కార్మికులు సంయుక్తంగా ఐక్య ఉద్యమాలు సాగించారని వివరించారు. ఆంధ్ర రాష్ట్రంలో ఇటీవల కాలంలో రెండు పెద్ద సమ్మెలు నిర్వహించామని, అందులో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమ్మె 42 రోజులు చారిత్రాత్మకంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సమ్మె వల్ల అనేక విజయాలు సాధించామని, ఒకపక్క ప్రభుత్వం సమ్మెను విఫలం చేయాలని అనేక రకాలుగా ప్రయత్నించినా... చివరకు ఎస్మా చట్టం ప్రయోగించినప్పటికీ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు గట్టిగా నిలబడి పోరాడారన్నారు. ఇందులో ఏఐటీయూసీ కీలక భూమిక పోషించిందని వివరించారు. ఆ తర్వాత రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులు చేసిన సమ్మె విజయవంతమైందని, ఈ సందర్భంలో కూడా ప్రభుత్వం దిగిరాక తప్పలేదన్నారు. ఈ సమ్మె వల్ల మున్సిపల్ కార్మికుల సమస్యలనేకం పరిష్కారమయ్యాయన్నారు. ఈ రెండు సమ్మెల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని రాబోయే కాలంలో కార్మిక వర్గ పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న ఎన్డీఏ కూటమిని, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాన్ని ఓడించాలన్నారు. కమ్యూనిస్టులు బలపరుస్తున్న ఇండియా కూటమిని గెలిపించాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్ మాట్లాడుతూ పోరాటాల ద్వారానే కార్మికవర్గ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఈ పోరాటాలను ఉధృతం చేసుకునే క్రమంలో కార్మిక వర్గం ఐక్య పోరాటాలను ముందుకు తీసుకెళ్లాలని, రానున్న ఎన్నికల్లో అన్ని కార్మిక సంఘాలు కలిసి ఎన్డీఏ కూటమిని ఓడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటసుబ్బయ్య, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని రామారావు, రాష్ట్ర ఆఫీస్ బేరర్లు డి సోమసుందర్, దామోదర్, నాగ సుబ్బారెడ్డి, మునెప్ప, గిరి, పడాల రమణ, ఎం రమేష్‌సుబ్బారాయుడు, కె. స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

సీఏఏ, యూసీసీ రద్దు చేస్తాం

చెన్నై: 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)తో పాటు జమిలి ఎన్నికలు, ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) ప్రణాళికలను రద్దు చేస్తామని, కొత్త జాతీయ విద్యా విధానం 2020ని తొలగిస్తామని, తమిళనాడు విద్యార్థులకు నీట్ ప్రవేశ పరీక్ష నుంచి మినహాయింపు ఇస్తామని, పార్లమెంటు, శాసనసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను తక్షణమే అమలు చేస్తామని పాలక డీఎంకే హామీ ఇచ్చింది. ఈ మేరకు డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ బుధవారం ఇక్కడ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేశారు. కాగా, 21 లోక్‌సభ స్థానాలకు పార్టీ అభ్యర్థులను ప్రకటించారు. మహిళలందరికీ నెలవారీ రూ.1,000 ఆర్థిక సాయం అందించడంతో పాటు సామాజిక న్యాయం ఆధారంగా మహిళలకు విద్య, ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని అధికార పార్టీ హామీ ఇచ్చింది. రైతులు, విద్యార్థుల రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించింది. మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు, భారతదేశంలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.లక్ష వరకు వడ్డీ లేని వాహన రుణాలు ఇస్తామని హామీ ఇచ్చింది. 'ఇండియా' కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న డీఎంకే... 'లింగ సమానత్వం వైపు ప్రయాణానికి ప్రాధాన్యతనిస్తూ, మహిళలకు రుతుక్రమ సెలవులు అందించే చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని డీఎంకే పట్టబట్టనుంది' అని పేర్కొంది. గృహ కార్మికుల హక్కులు, కనీస వేతనాల పరిరక్షణ కోసం 'ఏకీకృత జాతీయ చట్టం' రూపొందిస్తామని తెలిపింది. గృహ కార్మికుల ఉపాధిని క్రమబద్ధీకరించడం, వారి సామాజిక భద్రత, వారి ఫిర్యాదులను పరిష్కరించడం కోసం త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేస్తారు. చిన్న వ్యాపారాలు చేసుకునే మహిళలకు ప్రస్తుతం అందిస్తున్న 30 శాతం మూలధన రాయితీని 35 శాతానికి పెంచడంతో పాటు వ్యవసాయ రంగంలో మహిళా రైతులకు ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ యంత్రాలు, భూసార పరీక్ష, కార్యాచరణ మార్గదర్శకత్వం, విత్తనోత్పత్తి, వ్యవసాయంలో వారి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి జాతీయస్థాయి శిక్షణ అందించనున్నట్లు డీఎంకే తెలిపింది. మహిళలకు ప్రత్యక్ష మార్కెట్ సౌకర్యం అందించే విషయాన్ని వివరిస్తూ సేకరణ, అమ్మకాల కోసం కేవలం మహిళలే నిర్వహించే మార్కెట్లను జిల్లాస్థాయిలో ఏర్పాటు చేయడంతో పాటు వారికి ప్రత్యేక గుర్తింపు కార్డులు అందజేస్తామని పేర్కొంది. 'వంట గ్యాస్ సిలిండర్ల ధరను రూ.400 నుంచి రూ.1000కి పెంచారు. ఎన్నికల సమయంలో కేవలం రూ.100 మాత్రమే తగ్గించారు. ఇది ఎన్నికల మోసాన్ని ప్రదర్శిస్తోంది' అని మోదీ ప్రభుత్వాన్ని విమర్శించింది. పెట్రోలు, డీజిల్ ధరలు వరుసగా రూ.75, రూ.65గా ఉంటాయని, ఎల్పీజీ సిలిండర్ ధర రూ.500 ఉంటుందని మేనిఫెస్టోలో ప్రకటించింది. ఏప్రిల్ 19న జరగనున్న లోక్‌సభ ఎన్నికల కోసం 21 స్థానాలకు అభ్యర్థుల జాబితాను బుధవారం విడుదల చేసింది. ఇందులో సిట్టింగ్ ఎంపీలు కనిమొళి, టీఆర్ బాలు, ఎ.రాజా ఉన్నారు. కాంగ్రెస్, వామపక్ష పార్టీలు, వీసీకే తదితర మిత్రపక్షాలకు కేటాయించింది.

కేంద్రమంత్రి శోభపై ఈసీ ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవాలని ఈసీని కోరింది. తమిళనాడు ప్రజలను తీవ్రవాదులుగా ముద్ర వేసేందుకు కేంద్రమంత్రి యత్నించారని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని డీఎంకే పేర్కొంది. కేంద్రమంత్రిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని విన్నవించింది. దీనిపై స్పందించిన ఈసీ... కేంద్రమంత్రి వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించింది.

ఆమెపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చింది. బెంగళూరులో మంత్రి కరంద్లాజే మాట్లాడుతూ కర్నాటకలో శాంతి భద్రతలు క్షీణించాయని, తమిళనాడు నుంచి వచ్చిన వారు ఇక్కడ బాంబులు పెడుతున్నారని, దిల్లీ ప్రజలు 'పాకిస్థాన్ జిందాబాద్' నినాదాలు చేస్తారని, కేరళవారు యాసిడ్ దాడులకు పాల్పడతారని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ మాటలకు ఆమె తర్వాత క్షమాపణలు చెప్పారు. తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. కాగా, వివిధ వర్గాల మధ్య శత్రుత్వాన్ని పెంపొందించేందుకు యత్నించినట్లు మధురై పోలీసులు ఆమెపై కేసుపెట్టారు. కరంద్లాజే వ్యాఖ్యలను తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, డీఎంకే నేతలు ఆక్షేపించారు.

ఏపీ ఈఏపీసెట్ పరీక్ష తేదీల్లో మార్పులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఏపీలో ప్రవేశ పరీక్షలపై పోలింగ్ షెడ్యూలు ప్రభావం పడింది. మే 13న పోలింగ్ నేపథ్యంలో ఏపీ ఈఏపీసెట్‌తోపాటు వివిధ పరీక్షల తేదీలను ఉన్నత విద్యామండలి మార్పులు చేసింది. మే 13న జరగాల్సిన ఏపీ ఈఏపీసెట్ పరీక్షలను మే 16కు వాయిదా వేసింది. మే 16, 17 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు జరుగుతాయి. మే 18 నుంచి 22 వరకు ఇంజినీరింగ్ పరీక్షలను నిర్వహిస్తారు. జూన్ 3 నుంచి జరగాల్సిన ఏపీ పీజీసెట్‌ను అదే నెల10వ తేదీకి వాయిదా వేశారు. జూన్ 10 నుంచి 14 వరకు ఏపీ పీజీసెట్ పరీక్షలను నిర్వహిస్తారు.

ఆపరేషన్ పిఠాపురం

(మొదటిపేజీ తరువాయి)

అదీ జరగలేదు. జనసేనలో ఉన్న కాపు నేతలే ఆ పార్టీకి వరుస వారీగా దూరమవుతున్నారు. కిర్లంపూడికి చెందిన కాపు సామాజిక ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఏకంగా వైసీపీలో చేరారు. ఆయన పవన్‌ను లక్ష్యంగా విమర్శలు గుప్పిస్తున్నారు. విశాఖ, ఉభయ గోదావరి జిల్లాల నుంచి చాలా మంది జనసేన, ప్రజారాజ్యం పార్టీ మాజీ నేతలు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో ఎన్నికల రాకముందే జనసేన నుంచి చాలా మంది పార్టీని వీడి, పవన్‌కు షాక్‌లు ఇచ్చారు. ఇప్పుడు పవన్ కల్యాణ్ పోటీ చేసే అంశం పైనా తర్జనభర్జన నెలకొంది. అసలు పవన్ పిఠాపురం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తారా?, లేక కాకినాడ నుంచి ఎంపీగా బరిలో ఉంటారా? అనేదీ ప్రశ్నార్థకంగా మారింది. అటు 2019లో రెండు చోట్ల పవన్ పోటీ చేసి ఓటమి పాలయ్యారు. మళ్లీ 2019లో దానిని పునరావృతం చేసేలా వైసీపీ సీరియస్‌గా కసరత్తు చేస్తోంది.

పవన్ ఓటమిపై వైసీపీ ఫోకస్

పవన్ కల్యాణ్ ఓటమే లక్ష్యంగా వైసీపీ పెద్ద ఎత్తున దృష్టి పెట్టింది. ప్రస్తుతం పిఠాపురం నుంచి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కాకినాడ సిట్టింగ్ ఎంపీ వంగా గీతను పోటీలో ఉంచారు. కాపు సామాజిక వర్గానికి చెందిన వంగీ గీత గతంలో పిఠాపురం నుంచి ప్రజారాజ్యం తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. అంతకుముందు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా పని చేశారు. ఆ తర్వాత వైసీపీలో చేరి కాకినాడ ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. పిఠాపురంలో దాదాపు 2 లక్షల 40 వేల మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో కాపులు 95 వేల మంది, బీసీలో 90 వేల మంది, ఎస్సీలు 30 వేల మంది, మిగిలిన వారంతా ఇతర కులాలకు చెందిన వారున్నారు. పవన్ కల్యాణ్ పోటీలో ఉండటంతో కాపు ఓటర్లపైనే వైసీపీ అధికంగా ఆశించకుండా, మిగిలిన బీసీ, ఎస్సీ ఓటర్లపై దృష్టి పెట్టింది. బీసీలకు చెందిన పద్మశాలి, శెట్టి బలిజ, మత్స్యకారులను చైతన్యవంతులను చేసే దిశగా వైసీపీ రంగంలోకి దిగింది. దీంతో సీఎం జగన్ ఆదేశాల మేరకు పిఠాపురం నియోజకవర్గానికి కీలక నేతలను బాధ్యులుగా నియమించింది. ముఖ్య నేతలకు సీఎం దిశా నిర్దేశం చేస్తున్నారు. మంత్రి దాడిశెట్టి రాజా, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కన్నబాబుకు చెరొక మండలాలకు బాధ్యతలను అప్పగించింది. వైసీపీ ప్రాంతీయ సమన్వయకర్త, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి పిఠాపురం పట్టణ బాధ్యతలు కేటాయించింది. పిఠాపురం మొత్తం నియోజకవర్గ బాధ్యతలను ముద్రగడ పద్మనాభం, కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అప్పగించింది. ఒక్క మాట చెప్పాలంటే పిఠాపురం సర్వం జల్లెడ పట్టేలా వైసీపీ నేతలు ప్రణాళిక రూపొందించారు. రాబోయే ఎన్నికల నోటిఫికేషన్ నాటికి అక్కడున్న బీసీలు, ఉపకులాల వారీగా,ఎస్సీ సామాజిక వర్గాలకు ప్రత్యేకంగా నేతలను పంపి వారిని చైతన్యవంతులను చేయనున్నారు. వార్డులు, గ్రామాలకు ఒక ఇన్‌ఛార్జిని నియమించి, వైసీపీ గెలుపే లక్ష్యంగా పని చేయనున్నారు. పిఠాపురంలో వైసీపీ దూకుడుతో పవన్‌కు మింగుడు పడటం లేదు.

తలపోటుగా మారిన టీడీపీ నేత వర్మ

మరోవైపు పిఠాపురం పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించడంపై టీడీపీ టికెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే వర్మ, ఆయన అనుచరులు ఆగ్రహంతో ఉన్నారు. పవన్‌కు మాజీ ఎమ్మెల్యే వర్మ పెద్ద తలపోటుగా మారారు. పవన్ కల్యాణ్ పిఠాపురం నుంచి పోటీ చేస్తానని ప్రకటించిన నాడే, పెద్దఎత్తున వర్మ అనుచరులు టీడీపీ జెండాలు, కరపత్రాలను దగ్ధం చేశారు. పవన్‌పై ఆగ్రహంతో కార్యకర్తలు ఊగిపోయారు. అనంతరం చంద్రబాబుతో పిలుపుతో ఆయనను వర్మ కలిశారు. అక్కడ లోపాయికారి ఒప్పందాల్లో భాగంగా పవన్ గెలుపు కోసం పనిచేస్తానని వర్మ ప్రకటించారు. అదే సమయంలో తాను అవసరమైతే ఎంపీగా పోటీ చేస్తానని, పిఠాపురానికి జనసేనకు చెందిన కాకినాడ ఎంపీ అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్‌ను నిలుపుతానని పవన్ చేసిన వ్యాఖ్యలపై వర్మ మండిపడ్డారు. తాను పవన్ అయితేనే గెలిపిస్తానని, మరొక జనసేన నేత పిఠాపురం వస్తే సహకరించేది లేదని, తానే టీడీపీ తరపున బరిలో దిగుతానని నొక్కి చెప్పారు. అటు అధికార వైసీపీ వ్యూహాలు, ఇటు పొత్తులో భాగంగా టీడీపీ నుంచి వస్తున్న నిరసనలు వెరసి పవన్‌కు పిఠాపురం గెలుపు పెద్ద సమస్యగా మారింది. ఒకవైపు అధికార వైసీపీ మొత్తం అసెంబ్లీ, పార్లమెంటు సీట్లను ప్రకటించి, ప్రచారంలో ముందజలో ఉంది. జనసేనకు కేటాయించిన 21 సీట్లలో కేవలం ఆరుగురు ఎమ్మెల్యే, ఒక ఎంపీ అభ్యర్థిని ప్రకటించడానికి నానా కష్టాలు పడాల్సి వచ్చింది. మిగిలిన అసెంబ్లీ సీట్లకు సరైన అభ్యర్థులు లేక పవన్ నానా తంటాలు పడుతున్నారు. పార్టీ అధినేతగా ఉన్న పవన్, తాను పోటీ చేసే స్థానంపై అయోమయంలో ఉండటంతో పార్టీ నేతలు నిరుత్సాహానికి గురవుతున్నారు. కనీసం పొత్తులో భాగంగా జనసేనకు ఇచ్చిన సీట్ల కేటాయింపుపై నిరసనలు రావడంతో పవన్‌కు దిక్కుతోచడం లేదు. అటు పిఠాపురం జనసేన మాజీ ఇన్‌ఛార్జి మాకినీడు శేషుకుమారి వైసీపీలో చేరారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఎంపీ వంగా గీతతో కలిసి ఆమె సీఎం జగన్ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గత ఎన్నికల్లో పిఠాపురం నుంచి జనసేన అభ్యర్థిగా ఆమె పోటీ చేసి ఓటమి పాలయ్యారు.

సార్వత్రిక సమరం షురూ

(మొదటిపేజీ తరువాయి)

అసెంబ్లీలో బీజేపీ 41 సీట్లు, జేడీ(యూ) ఏడు సీట్లు, ఎన్‌పీపీ ఐదు సీట్లు, కాంగ్రెస్ నాలుగు సీట్లు, పీపీఏ ఒక సీటులో గెలుపొందగా... ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు కూడా విజయం సాధించారు. కాగా ఈ రాష్ట్రంలో బీజేపీ అన్ని అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. అరుణాచల్ పశ్చిమ లోక్‌సభ స్థానానికి కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు, అరుణాచల్ తూర్పు స్థానానికి తపిర్ గావ్‌ను అభ్యర్థులుగా ప్రకటించింది. ఇక మొదటి దశలో అసోంలో కాజిరంగా, సోనిత్‌పూర్, దిబ్రూగఢ్, లఖింపూర్, జోర్హాట్ స్థానాలకు ఏప్రిల్ 19న ఎన్నికలు జరగనున్నాయి. పోటీలో ఉన్న దిబ్రూగఢ్ నుంచి కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్, జోర్హాట్ నుంచి లోక్‌సభలో కాంగ్రెస్ ఉపనేత గౌరవ్ గొగోయ్ తదితరులు ఉన్నారు. పుదుచ్చేరిలో, రిటర్నింగ్ అధికారి ఎ.కులోత్తుంగన్ కేంద్రపాలిత ప్రాంతంలోని ఏకైక లోక్‌సభ స్థానానికి ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. కాగా మొదటి దశలో జమ్మూకాశ్మీర్‌లోని ఉధంపూర్-కతువా లోక్‌సభ నియోజకవర్గంలో కూడా పోలింగ్ జరగనుంది. ఇప్పటివరకు బీజేపీ, డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ మాత్రమే ఈ స్థానానికి తమ అభ్యర్థులను ప్రకటించాయి. సిట్టింగ్ ఎంపీ, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, మాజీ మంత్రి జీఎం సరూరి అభ్యర్థులుగా ఉన్నారు. అయితే ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్‌లో కొన్ని మార్పులు చేసిన సంగతి విదితమే. అరుణాచల్‌ప్రదేశ్, సిక్కింలో ఓట్ల లెక్కింపును జూన్ 4 నుంచి జూన్ 2వ తేదీకి మార్చింది.

96.88 కోట్ల మంది ఓటర్లు

దేశంలో మొత్తం 96.88 కోట్ల ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 49.7 కోట్ల మంది ఉండగా, మహిళలు 47.1 కోట్ల మంది ఉన్నారు. 85 ఏళ్ల పైబడిన ఓటర్ల సంఖ్య 82 లక్షలు. 20-29 ఏళ్ల వయసు మధ్య ఉన్న ఓటర్లు 19.74 కోట్ల మంది ఉన్నారు. ఈసారి 18-19 వయసున్న 1.8 కోట్లు యువ ఓటర్లు కొత్తగా ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఇక ఈ ఎన్నికల కోసం 55 లక్షల ఈవీఎంలు వినియోగిస్తున్నారు. 10.5 లక్షల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ ఎన్నికల్లో 1.5 కోట్ల మంది పోలింగ్ అధికారులు, భద్రతా సిబ్బంది పాలు పంచుకోనున్నారు.

డీకే టీఎంసీ కార్మికుల భారీ ర్యాలీ

మిల్లు ప్రారంభించండి లేదా పరిహారం ఇవ్వండి

చల్లా చిన ఆంజనేయులు డిమాండ్

విశాలాంధ్ర-గుంటూరు: గుంటూరు నగరంలో అకారణంగా మూసివేసిన డీకే టీఎంసీ మిల్లును వెంటనే ప్రారంభించాలని కార్మికులు ఆందోళనకు దిగారు. యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి విడనాడాలని, తమకు పని కల్పించాలని డిమాండ్ చేశారు. గుంటూరు బైపాస్ రోడ్డులోని ఓల్డ్ బీజీటీఐ ఆయిల్ మిల్లు ఆవరణలో గల డీకే టీఎంసీ మిల్లుతెరవాలని, కార్మికులకు పని కల్పించాలని, లేకపోతే నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ నగర ముఠా కార్మిక సంఘం(ఏఐటీయూసీ) అధ్వర్యంలో బుధవారం భారీ కార్మిక ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ హమాలీ ముఠా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చినఆంజనేయులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి డీకే టీఎంసీలో పనిచేస్తున్న కార్మికులకు ఎటువంటి సమాచారం లేకుండా యజమానులు దేవరశెట్టి కోటేశ్వరరావు, దేవరశెట్టి కృష్ణమూర్తి మిల్లును మూసివేశారని విమర్శించారు. నష్ట పరిహారం చెల్లించకుండా మీనమేషాలు లెక్కిస్తూ కార్మికులను నిత్యం వేధిస్తున్నారని, యాజమాన్యంతో చాలాసార్లు చర్చలు జరిపినప్పటికీ ఫలితం లభించలేదని మండిపడ్డారు. కార్మికశాఖ అధికారులకు సైతం వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. కార్మికులకు రావాల్సిన పరిహారం చెల్లించమని అడిగినందుకు యాజమాన్యం ముఠా మేస్త్రి వేముల కోటేశ్వరరావుపై కక్ష సాధింపు చర్యలకు దిగిందని, పోలీసులను అడ్డుపెట్టుకుని తన మిల్లు అమ్ముకోవాలని చూస్తున్నదని ఆరోపించారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ కార్మిక హక్కులను కాలరాస్తున్న యాజమాన్యం తీరుపై ఆగ్రహం వెలిబుచ్చారు. కార్మికుల రక్తంతో కోట్లాది రూపాయలు సంపాదించుకున్న యాజమాన్యం... భూమి విలువ పెరగడంతో మిల్లు మూసివేసి అధిక ధరకు అమ్ముకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మిల్లు అమ్మకాన్ని ఆపినందుకు కార్మికులపై తిరిగి కేసులు పెట్టడం దారుణమని అన్నారు. కార్మిక చట్టాలు అమలు చేయకుండా ఇన్ని సంవత్సరాలు వారి శ్రమను దోచుకున్న యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు రావుల అంజిబాబు మాట్లాడుతూ మిల్లు మూసివేత, అమ్మకానికి సంబంధించి యాజమాన్యం కనీసం కార్మికులకు సమాచారం ఇవ్వలేదని ఆరోపించారు. దీంతో యాజమాన్యంపై కార్మికవర్గం తీవ్ర ఆగ్రహంతో ఉందని, ఇప్పటికైనా కార్మికులకు రావాల్సిన నష్టపరిహారం, పనిభద్రత, చట్టబద్ధ సౌకర్యాలు వెంటనే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు చల్లా మరియదాసు, ముఠా కార్మిక సంఘం నగర నాయకులు వేముల కోటేశ్వరరావు, రేగుల రాఘవ, కొత్త శివారెడ్డి, బోయపాటి శ్రీకాంత్, ఏనుగంటి వెంకట్రావు, ఎస్పీ కొండయ్య, కొత్త నాని, రేగుల నానయ్య, రామినేని శ్రీనివాస్, రేగుల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు సత్కారం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్ పోర్ట్ అండర్ టేకింగ్స్ (ఏఎస్ఆర్టీయూ) వైస్ ప్రెసిడెంట్‌గా ఎంపికైన ఏపీఎస్ఆర్టీసీ ఎండీ సిహెచ్.ద్వారకా తిరుమలరావును ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ సత్కరించింది. విజయవాడ బస్‌హౌస్‌లో బుధవారం ఎండీని ఈయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య తదితరులు కలిసి అభినందించారు. ఆర్టీసీకి జాతీయ స్థాయిలో ఐదు అవార్డులు రావడంతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న ఆర్టీసీలకు సంబంధించి ఏఎస్ఆర్టీయూకు వైస్ ప్రెసిడెంట్‌గా ద్వారాక తిరుమలరావు ఎంపికవడం గొప్ప విషయమన్నారు. రాష్ట్రనాయకులు ఎండీఏ సిద్ధిక్, టీవీ భవాని, కె.కోటేశ్వరరావు, మందపాటి శంకరరావు, షేక్ మోహిద్దీన్, జీఎస్ నారాయణ, విజయవాడ జోనల్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైసీపీలోకి వంగవీటి నరేంద్ర

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాధారంగా మిత్ర మండలి రాష్ట్ర అధ్యక్షుడు వంగవీటి నరేంద్ర వైసీపీలో చేరారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో బుధవారం పార్టీ అధినేత, సీఎం జగన్ సమక్షంలో ఆయన తీర్థంపుచ్చుకున్నారు. నరేంద్రకు జగన్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనతరం వంగవీటి మాట్లాడుతూ రంగాను చంపిన టీడీపీతో పవన్ వెళ్లడమేమిటని ప్రశ్నించారు. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు అనైతికమని విమర్శించారు. కూటమి ఏర్పాటు ప్రజల కోసం కాదని, వారి స్వార్థం కోసమని అన్నారు. పవన్ కల్యాణ్ వెంట కాపులెవరూ ఉండబోరని తేల్చిచెప్పారు. ఆయన వెంట రాధారంగా మిత్రమండలి సభ్యులు షేక్ బాబు, ఇమ్రాన్ రజా, పి.నరేంద్ర, నాగ శ్రీనివాస్ ఉన్నారు. అంతకుముందు జనసేన తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం మాజీ ఇన్‌ఛార్జి మాకినీడు శేషకుమారి జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. ఉభయ గోదావరి జిల్లాల వైసీపీ సమన్వయకర్త, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి: కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-చల్లపల్లి : కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. కృష్ణాజిల్లా చల్లపల్లిలోని చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 23న భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా అధ్వర్యంలో దేశవ్యాప్తంగా భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించి, కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనలు తెలియజేయాలని ప్రకటించిన నేపథ్యంలో ఆంధ్ర ప్రదేశ్‌లో కూడా రైతులు యువజన, విద్యార్థి సంఘాలను కలుపుకొని భగత్ సింగ్‌కు నివాళులర్పించి కాగడాల ప్రదర్శన ద్వారా కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలపై నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా ఈనెల 14న దిల్లీలోని రామ్ లీలా మైదానంలో 50 వేల మందికి పైగా రైతులతో బహిరంగ సభ జరిగిందని, ఈ సభను నిర్వీర్యం చేయడానికి మోదీ ప్రభుత్వం రైతులను ముందస్తు అరెస్టులు చేసి సభను సజావుగా సాగకుండా అడ్డుకుందని విమర్శించారు. ఒకపక్క సభలకు అనుమతిస్తూ మరోపక్క అడ్డుకునే చర్యలు సమంజసం కాదన్నారు. రైతులు దిల్లీ కేంద్రంగా చేసిన ఉద్యమాన్ని విరమించేందుకు కేంద్ర ప్రభుత్వం లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాత్రమే కోరుతున్నారని తెలిపారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సును అమలు చేయాలని, మద్దతు ధరలకు గ్యారెంటీ చట్టం చేయాలని, రైతాంగానికి ఉండే అప్పులను ఒక పర్యాయం రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని ఆర్‌బీకే కేంద్రాలకు తరలించి 62 రోజులైనప్పటికీ నేటి వరకు వారి ఖాతాల్లో నగదు జమ కాలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మర్నీడు యలమందరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, జిల్లా కార్యదర్శి గుత్తికొండ రామారావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, పెనుమత్స ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

కౌలు రైతులకు భద్రత కల్పించాలి

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య

విశాలాంధ్ర-ఏలూరు: కౌలు రైతులందరికీ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా పెదపాడులో కౌలు రైతు సంఘం మండల మహాసభ సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ను వెంకటరావు అధ్యక్షతన బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జమలయ్య మాట్లాడుతూ, భూ యజమానుల భూములను 80 శాతం వరకు కౌలు రైతులే సాగు చేస్తున్నారని తెలిపారు. వ్యవసాయంలో కీలకపాత్ర పోషిస్తున్న కౌలు రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రైతుల సంక్షేమ పథకాలు అందడం లేదని ఆరోపించారు. ప్రకృతి విపత్తులు, చీడ పీడలు తదితర సమస్యల వల్ల కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాల అస్తవ్యస్త విధానాల వలన ప్రతి 40 నిమిషాలకు ఒక కౌలు రైతు మరణిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. వీరిలో అధికశాతం దళితులు, గిరిజనులు, మైనారిటీ, వెనుకబడిన తరగతులు ఉన్నారని చెప్పారు. వీరికి ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ప్రభుత్వం నుంచి పెట్టుబడి రాయితీ, బీమా పరిహారం అందడం లేదని విమర్శించారు. తరతరాలుగా సాగు చేస్తున్న దేవదాయ, ధర్మదాయ భూములను బహిరంగ వేలంతో సంబంధం లేకుండా పేద రైతులకు లీజుకు ఇవ్వాలని, సాగు చేసే కౌలు రైతులందరినీ గుర్తించి గుర్తింపు కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నేత, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ, కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు అందజేయాలని కోరారు. గుర్తింపు కార్డుల జారీలో రెవెన్యూ శాఖ అన్యాయం చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం నిబంధనలు సడలించి బ్యాంకు రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి తమ మద్దతును ఉపసంహరించుకుంటూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పాలన సాగిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌలు రైతులందరూ తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యపోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు మాట్లాడుతూ కౌలు రైతులకు పంటల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, వ్యవసాయ యంత్ర పరికరాలు, పూర్తి సబ్సిడీతో అందించాలని కోరారు. కౌలు రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ మాట్లాడుతూ వర్షాభావంతో పంటలు పండనప్పుడు, తుఫాన్లు, వరదలు సంభవించినప్పుడు పంటలు పూర్తిగా నష్టపోయిన సందర్భంలో యజమానులు కౌలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని, ఇలాంటి ప్రకృతి విపత్తుల సంభవించినప్పుడు కౌలు రద్దు తో పాటు, బీమా పరిహారం ప్రభుత్వమే చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దేవదాయ ధర్మదాయ భూములను సాగు చేస్తున్న భూమిలేని కౌలు రైతులకు యాజమాన్య హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు తక్కెళ్ళ పాటి ప్రసాదరావు మాట్లాడారు.

ఆంధ్రప్రదేశ్‌ను అమెరికా చేస్తా: కేఏ పాల్

విశాలాంధ్ర-శృంగవరపుకోట: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీని 100 స్థానాల్లో గెలిపిస్తే ఆంధ్రప్రదేశ్ ను అమెరికా వలే అభివృద్ధి చేసి చూపుతానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ స్పష్టం చేశారు. విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం బొరాక చర్చికి బుధవారం సాయంత్రం ఆయన విచ్చేశారు. విలేకరులతో మాట్లాడుతూ, తనను ఎస్.కోట ఎమ్మెల్యేగా పోటీ చేయమని అభిమానులు, ఆత్మీయులు కోరుతున్నారని... ఆలోచించి ఓ నిర్ణయం తీసుకుంటానని అన్నారు. ప్రస్తుతం తాను విశాఖ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, తనను ఎంపీగా గెలిపిస్తే అమెరికాలోని వాషింగ్టన్ డీసీ వలే అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. చంద్రబాబు స్టీల్ ప్లాంట్ భూములు అమ్మేశారు, జగన్ 60వేల కోట్లు విలువైన గంగవరం పోర్టును అదానీకి రూ.620 కోట్లకు అమ్మేశారు, తాను ఇటీవల హైకోర్టులో పిల్ దాఖలు చేసి స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా వాదనలు వినిపించానని, హైకోర్టు ఆర్డర్ జారీ చేసిందని, కానీ ఇప్పుడు కార్మికులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని గుర్తు చేశారు. ప్రజాశాంతి పార్టీకి ఒక్క అవకాశం ఇచ్చి చూడండని ప్రజలకు పిలుపునిచ్చారు.

'రత్నం సార్' కన్నుమూత

ప్రముఖుల సంతాపం

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: విద్యారంగ చరిత్రలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకున్న 'రత్నం సార్' నెల్లూరు హరినాథపురంలోని స్వగృహంలో బుధవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. నాలుగు దశాబ్దాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రత్నం విద్యా సంస్థల పేరుతో ఎంతోమంది విద్యార్థులను డాక్టర్లు, ఇంజనీర్లుగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దిన వ్యక్తి కె.వి.రత్నం. రత్నం సార్ అంటే తెలియని వారు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, ప్రపంచంలోనే తెలుగువారు ఎవరు ఉండరు అని చెప్పవచ్చు. 1943లో ఓ సామాన్య కుటుంబంలో ఆయన జన్మించారు. నెల్లూరు వీఆర్ కళాశాలలో బీఎస్సీ పూర్తి చేశారు. అదే కళాశాలలో 1966లో తన ఉద్యోగపర్వాన్ని ప్రారంభించిన రత్నం సార్... మిత్రుల సహకారంతో నెల్లూరులోనే రజక వీధిలో జయంతి ట్యుటోరియల్స్ అనే సంస్థను ప్రారంభించి అనతి కాలంలో దానిని మూసివేయాల్సి వచ్చింది. 1983లో తన సొంత పేరుతో రత్నం కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించి రాష్ట్రంలోనే కోచింగ్ సెంటర్లకు నాంది పలికిన తొలి వ్యక్తి రత్నం సార్. 1985లో వీఆర్ కాలేజీలో తాను చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి రత్నం విద్య సంస్థలను అంచలంచెలుగా తీర్చిదిద్దుతూ రాష్ట్రంలోనే కాక దేశంలోనే ఓ గుర్తింపు పొందిన సంస్థగా తీర్చిదిద్దిన వ్యక్తి కేవీ రత్నం. ఆయనకు ఇద్దరు కుమారులు, భార్య. కుమారులిద్దరూ ఆయన బాటలోనే నడుస్తూ రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో విద్యా సంస్థలను ప్రారంభించి తండ్రి ఆశయాలకు అనుగుణంగా ఆ విద్యా సంస్థలను తీర్చిదిద్దుతున్నారు. రత్నం మృతి ఉభయ రాష్ట్రాల్లో విద్యారంగం ఓ పెద్ద దిక్కును కోల్పోయిందని మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బీద మస్తాన్ రావు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, టీడీపీ నేత బీదా రవిచంద్ర, సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, నగర కార్యదర్శి అరిగెల నాగేంద్ర సాయి, లాయర్ పత్రిక అధినేత తుంగ శివప్రభాత్ రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేశ్, బీజేపీ నేత సురేశ్ రెడ్డి, ఆంజనేయ రెడ్డి, పట్టణానికి చెందిన పలువురు డాక్టర్లు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

స్వేచ్ఛగా ఎన్నికలు

- 46,165 పోలింగ్ కేంద్రాలు
- 50 శాతం కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు
- 85 ఏళ్లు నిండినవారు, వికలాంగులకు ఇంటి నుంచే ఓటు
- ఎన్నికల బందోబస్తుకు కేంద్ర, రాష్ట్ర పోలీసులు
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రానున్న సాధారణ, అసెంబ్లీ ఎన్నికలను స్వేచ్ఛగా, శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి వెల్లడించారు. ఎన్నికల సన్నాహక ఏర్పాట్లపై బుధవారం వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనాతో కలిసి సీఎస్ సమీక్షించారు. ముఖ్యంగా సైబర్ సెక్యూరిటీ, ఐటీ, స్వీప్, శాంతి భద్రతలు, కమ్యూనికేషన్ ప్లాన్, ఫిర్యాదుల పరిష్కారం, ఓటరు హెల్ప్ లైన్, పోలింగ్ కేంద్రాల్లో ఉండాల్సిన కనీసం సౌకర్యాలు వంటి అంశాలపై సమీక్షించారు. సీఎస్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలు పూర్తి స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పునరుద్ఘాటించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 46,165 పోలింగ్ కేంద్రాలుండగా వాటిలో కనీసం 50 శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ సౌకర్యాన్ని కల్పించామన్నారు. వెబ్ కాస్టింగ్ ఉన్న పోలింగ్ కేంద్రాలను నేరుగా కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం కంట్రోల్ రూమ్‌తో అనుసంధానమై పోలింగ్ సరళిని నిరంతరం పర్యవేక్షిస్తామని చెప్పారు. జనవరి నుంచి ఇప్పటివరకు రూ.176 కోట్ల విలువైన వస్తువులు... అనగా రూ.78 కోట్ల నగదు, రూ.41 కోట్ల విలువైన ఖరీదైన వస్తువులు, రూ.30 కోట్ల విలువైన వివిధ మాదక ద్రవ్యాలు వంటివి స్వాధీనం చేసుకున్నట్లు సీఎస్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన నాలుగు రోజుల్లోనే వివిధ మోడల్ కోడ్ తనిఖీ బృందాల ద్వారా రూ.3 కోట్ల 39 లక్షల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను స్వాధీన పర్చుకోగా వాటిలో రూ.80 లక్షల నగదు, కోటి 60 లక్షల విలువైన మద్యం, రూ.29 లక్షల విలువైన మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని మరింత కట్టుదిట్టంగా అమలు చేయడంతో పాటు ఇతర అక్రమాల నియంత్రణకు రాష్ట్ర సరిహద్దులు, ఇతర ప్రాంతాల్లో 60 ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులు సహా 121 చెక్ పోస్టులు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఎన్నికల బందోబస్తు నిమిత్తం కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలతో పాటు తమిళనాడు, కేరళ, కర్నాటక పోలీసుల సహాయం తీసుకుంటామని చెప్పారు. ఈసారి ఎన్నికల్లో 85 ఏళ్లు నిండిన వృద్ధులు, వివిధ అంగవైకల్యం కలిగిన ఓటర్లకు ఇంటి నుంచే వారి ఓటు హక్కును వినియోగించుకునేలా అవకాశం కల్పిస్తామని, ఓటు హక్కు ఆవశ్యకతపై ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన చేపడతామని వివరించారు. డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ బందోబస్తుకు లక్షా 50 వేల మంది రాష్ట్ర పోలీసులతో పాటు 522 కంపెనీల రాష్ట్ర ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు, 465 కంపెనీల కేంద్ర ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులతో పాటు కేరళ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి హోం గార్డు తదితర స్థాయి పోలీసులను నియమిస్తామని, రానున్న ఎన్నికల్లో శాంతిభద్రతల పరిరక్షణ, పటిష్ట బందోబస్తుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా ఎన్నికల సన్నద్ధతపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తూ, రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో 4 కోట్ల 9 లక్షల 41 వేల 182 మంది ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 46 వేల 165 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. భద్రతా సిబ్బందికి 12 వేల 683 వాహనాలు, పోలింగ్ సిబ్బందికి 13 వేల 322 వాహనాల అవసరత ఉందని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు 175 మంది అసెంబ్లీ, 25 మంది పార్లమెంటు రిటర్నింగ్ అధికారులు, 829 మంది మంది అసెంబ్లీ, 209 మంది పార్లమెంటు ఎఆర్‌ఓలు, 5 వేల 67 మంది సెక్టోరల్ అధికారులు, 5 వేల 67 మంది సెక్టోరల్ పోలీసు అధికారులు, 18 వేల 961 మంది మైక్రో పరిశీలకులు, 55 వేల 269 మంది ప్రిసైడింగ్ అధికారులు, 2 లక్షల 48 వేల 814 మంది పోలింగ్ అధికారులు, 46 వేల 165 బూత్ స్థాయి అధికారులు, 416 మంది జిల్లా స్థాయి నోడల్ అధికారులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో హోం, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, విద్యాశాఖల ముఖ్య కార్యదర్శులు హరీశ్ కుమార్ గుప్త, శశిభూషణ్ కుమార్, ప్రవీణ్ ప్రకాశ్, రాష్ట్ర చీఫ్ కమిషనర్ టాక్స్ గిరిజా శంకర్, విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్, హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి విజయకుమార్, సీడీఎంఏ శ్రీకేశ్ బాలాజీ రావు, అదనపు సీఈఓ హరీంద్ర ప్రసాద్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డైరెక్టర్ రవి ప్రకాశ్ తదితర అధికారులు పాల్గొన్నారు. వర్చువల్‌గా ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రజత్ భార్గవ, విజయానంద్, ఐటీ కార్యదర్శి కె.శశిధర్, అధికారులు ప్రద్యుమ్న, బాగ్చి తదితరులు హాజరయ్యారు.

వీఆర్వో అశోక్‌పై దాడి అమానుషం

భూపతిరాజు రవీంద్ర రాజు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వ స్థలం కబ్జా విషయంపై ప్రశ్నించినందుకు గాను శ్రీ సత్యసాయి జిల్లా లక్ష్మీ చెన్నై కేశవపురం 26వ వార్డు సచివాలయ వీఆర్వో అశోక్‌పై సాకే నరసింహులు అనే వ్యక్తి దాడి చేయడం అమానుషమని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, రాష్ట్రంలో కొంతమంది రాజకీయ నాయకులు రాష్ట్రవ్యాప్తంగా యదేచ్ఛగా భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇలాంటి వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని చాలాసార్లు కోరామని గుర్తుచేశారు. చాలా చోట్ల ఇంకా రాజకీయ నాయకుల వత్తిళ్లతో పోలీసులు, రెవెన్యూ అధికారులు వీఆర్వోలపై జరుగుతున్న దాడులపై స్పందించడం లేదని తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారులకు కొంతమంది అధికారులు సహకరించడం లేదని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ విషయంపై ఎన్నికల కమిషనర్ దృష్టి పెట్టి, అలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

డీఎస్సీ వాయిదా వేయాలి: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: డీఎస్సీ పరీక్ష వాయిదా వేసి ఎన్నికల అనంతరం మెగా డీఎస్సీ నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డికి బుధవారం ఆయన ఒక లేఖ రాశారు. రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగ యువత గత కొన్నేళ్లుగా ఎదురు చూస్తుండగా... 30 వేల ఉపాధ్యాయ పోస్టుల ఖాళీ ఉండగా హడావుడిగా కేవలం 6,100 పోస్టులు మాత్రమే ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఇది ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ప్రయత్నించినట్లు ఉందేగానీ నిరుద్యోగ సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో చేసినట్టు లేదనేది స్పష్టమౌతోందన్నారు. రాష్ట్రంలో ఈనెల 30 నుంచి ఏప్రిల్ 30 వరకు ఎన్నికల ప్రచారం ముమ్మరంగా కొనసాగుతున్న సమయంలో ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. ఈ సమయంలో విద్యార్థులు చదువుకోవడానికి అంత సానుకూలత ఉండదని అన్నారు. టెట్ పరీక్షలు జరిగాయని,. డీఎస్సీ ప్రిపరేషన్ కావడానికి సమయం కావాలని, సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులు, స్కూలు అసిస్టెంట్ పోస్టులకు సన్నద్ధం అవుతున్నారని తెలిపారు. వీరంతా పదో తరగతి పేపర్లు దిద్దడానికి వెళ్లాల్సిన అవసరముందని, వాటన్నింటిని దృష్టిలో పెట్టుకుని డీఎస్సీ వాయిదా వేసి ఎన్నికల అనంతరం సమగ్ర డీఎస్సీని ప్రకటించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

'ఉక్కు'పై అమర్నాథ్ బాకా ప్రచారం

ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తామన్న మభ్యపెట్టే మాటలపై కార్మిక సంఘాల ఆగ్రహం

విశాలాంధ్ర-గాజువాక: 'ఉక్కు' ప్రైవేటీకరణను అడ్డుకుంటామంటూ మంత్రి అమర్నాథ్ చేస్తున్న బాకా ప్రచారంపై పలువురు కార్మిక సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపలేని ముఖ్యమంత్రి జగన్, మళ్లీ సీఎం అయితే ప్రైవేటీకరణను అడ్డుకుంటారని అమర్నాథ్ గాజువాక సభలో కార్మికులను మభ్యపెట్టేలా ప్రచారం నిర్వహించడంపై మండిపడుతున్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు, ఉద్యోగులు, కార్మిక సంఘాలు, వామపక్షాలు చిత్తశుద్ధిగా గత మూడేళ్లుగా ఉద్యమిస్తుంటే, అధికార వైసీపీ దాగుడుమూతల ఉద్యమం చేపట్టిందన్నారు. కేంద్రంపై ఒత్తిడి చేయలేని జగన్, మళ్లీ సీఎం అయితే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ముందుగా చేతులెత్తేది వైసీపీయే అని అనడాన్ని కార్మిక సంఘాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. గాజువాక నియోజకవర్గంలో అత్యధికంగా ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే వారే ఓటర్లుగా ఉన్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు మద్దతు లేనిదే ఎవరికైనా గెలుపు సాధ్యం కాదు. వైసీపీ అభ్యర్థిగా గాజువాక నుంచి పోటీచేస్తున్న అమర్నాథ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా చూసే బాధ్యత తమదే అంటూ ప్రచారాన్ని మొదలుపెట్టారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు దొంగ ఉద్యమాలు చేసే పార్టీలకు తగిన గుణపాఠం చెప్పేందుకు ఉక్కు కార్మికులు, ఉద్యోగులు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. గెలుపు కోసం చెప్పే మాయమాటలు నమ్మబోమని, ఎవరు స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు నిలబడతారో తమకు తెలుసునని ఇప్పటికే విజ్ఞులైన ఓటర్లు సన్నద్ధమైనట్టు వినికిడి.

సంపాదకీయం

గవర్నర్ స్థానంపై నీలి నీడలు

తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ రాజీనామా చేయడం దానిని రాష్ట్రపతి ఆమోదించడం అకస్మాత్తుగానే జరిగిపోయాయి. తాను మళ్లీ ప్రజా జీవనంలోకి అంటే క్రియాశీల రాజకీయాలలో ప్రవేశిస్తానని కేంద్ర ప్రభుత్వ పెద్దలకు తమిళిసై విన్నవించారట. ఆ పెద్దలు ఆమె కోరికను వెంటనే ఆమోదించేశారు. తమిళిసై పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నరుగా కూడా అదనపు బాధ్యతలు నిర్వహించేవారు. తమిళిసై స్థానంలో జార్ఖండ్ గవర్నరుగా ఉన్న రాధాకృష్ణన్‌ను తెలంగాణ గవర్నరుగా నియమించడంతో పాటు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ బాధ్యతలు కూడా అప్పగించారు. రాధాకృష్ణన్ బుధవారం బాధ్యతలు స్వీకరించడం కూడా పూర్తి అయింది. తమిళిసై క్రియాశీల రాజకీయాలలోకి ప్రవేశించడంలో తప్పులేదు. అది ఆమె హక్కు కానీ క్రియాశీల రాజకీయాలలో ఉన్న వారిని గవర్నర్లుగా నియమించడం వారు నేరుగా మళ్లీ క్రియాశీల రాజకీయ రంగంలోకి దూకడం గవర్నర్ల నియామకం జరుగుతున్న తీరుపై కచ్చితంగా ప్రశ్నలు తలెత్తుతాయి. రాజకీయ నిరుద్యోగులకు, క్రియాశీల రాజకీయాల్లో ఉన్నవారు తమ సొంత రాష్ట్రంలోనే ఉంటే ఆ రాష్ట్ర రాజకీయాలలో, ప్రభుత్వ నిర్వహణలో జోక్యం చేసుకుని విపత్కర పరిస్థితి సృష్టిస్తున్నారని భావించి వారిని ఏదో ఒక రాష్ట్రానికి గవర్నరుగా నియమించడం పరిపాటి అయిపోయింది. 1968–69లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించి కేంద్ర ప్రభుత్వాన్ని గడగడలాడించిన డా.మర్రి చెన్నా రెడ్డిని ఇలాగే ఉత్తరప్రదేశ్ గవర్నరుగా నియమించారు. ఆ తరవాత ఆయన మళ్లీ రాష్ట్ర రాజకీయాలలో చురుకైన పాత్ర నిర్వహించడమే కాక ముఖ్యమంత్రి కూడా అయిపోయారు. గవర్నర్లను కేంద్ర ప్రభుత్వ సిఫార్సు ఆధారంగా నియమించడం ఇప్పుడున్న పద్ధతి. కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు అన్న మాటలోనే ఆ నియామకాలలో అధికార పార్టీ రాజకీయాలు ఉంటాయనడంలో అనుమానమే అక్కర్లేదు. గవర్నర్లు కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా వ్యవహరిస్తారు. కానీ చాలామంది గవర్నర్లు తాము గవర్నరుగా ఉన్న రాష్ట్రం కనక కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి చెందింది కాకపోతే ఆ రాష్ట్ర ప్రభుత్వ పాలనా నిర్వహణకు అడుగడుగునా అడ్డంకులు కల్పించడమూ మామూలు అయిపోయింది. అంటే గవర్నర్ల నియామకం రాజ్యాంగం నిర్దేశించిన పద్ధతిలో కాకుండా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చేస్థాయికి దిగజారి చాలా కాలమే అయింది. కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలోనూ గవర్నర్ల నియామకంపై అనుమానాలు తలెత్తాయి. ఆ సమయంలో రాష్ట్ర రాజకీయాలకు ఆటంకం కలిగిస్తున్నారనే నాయకులను ఏదో రాష్ట్రానికి గవర్నరుగా నియోగించేవారు. లేదా క్రియాశీల రాజకీయాలలో వారివల్ల ఫలితం లేదనుకున్నప్పుడు కూడా రాజ్‌భవన్లు రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారాయి. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరవాత గవర్నర్ల నియామకానికి మరోకోణం అదనంగా వచ్చి చేరింది. చిరకాలం ఆర్.ఎస్.ఎస్.లో చురుకుగా పనిచేసిన వారికి గౌరవ స్థానం కల్పించడానికి గవర్నర్ పదవులను వినియోగిస్తున్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరవాత గవర్నర్లుగా నియమితులైన కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, తమిళనాడు గవర్నర్ రవి ఎలా వ్యవహరించారో చూశాం. రాష్ట్ర ప్రభుత్వాలతో ఘర్షణకు దిగిన గవర్నర్లలో మునుపటి పుదుచ్చేరి గవర్నర్ కిరణ్ బేడీ, తమిళనాడు గవర్నరుగా పనిచేసిన బన్వారి లాల్ పురోహిత్ కూడా ఉన్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు అడ్డంకులు కల్పించడమే వీరు పనిగా పెట్టుకున్నారు. గవర్నర్ల నియామకానికి అనుసరించవలసిన విధానాలను నిర్దేశిస్తూ సర్కారియా కమిషన్ సిఫార్సులను మొదట కాంగ్రెస్, ప్రస్తుతం బీజేపీ పట్టించుకున్న పాపాన పోలేదు.

తెలంగాణ ఏర్పడిన తరవాత అంతకు ముందు ఉమ్మడి రాష్ట్రానికి గవర్నరుగా ఉన్న ఇ.ఎస్.ఎల్. నరసింహం గవర్నరుగా కొనసాగారు. ఆయన తమిళనాడుకు చెందిన వారే. ఆ తరవాత 2019 నవంబర్ లో తమిళసైని తెలంగాణ గవర్నరుగా నియమించారు. ఇప్పుడు గవర్నర్ బాధ్యతలు చేపట్టిన రాధాకృష్ణన్ కూడా తమిళనాడు వారే. రాష్ట్ర ప్రభుత్వానికి అడ్డంకులు కల్పించడంలో తమిళసై ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌ను, రవిని మించి పోలేదు కానీ ఆమె కూడా వివాదాలలో చిక్కుకున్న సందర్భాలు చాలానే ఉన్నాయి. అప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రిగా ఉన్న తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత కె. చంద్రశేఖర్ రావుకు, గవర్నర్ తమిళసైతో ఎదురైన విభేదాలు రచ్చకెక్కాయి. కె.సి.ఆర్. గవర్నర్‌ను పట్టించుకోవడమే మానేశారు. 2022 మార్చిలో తెలంగాణ బడ్జెట్ సమావేశం ప్రారంభమైనప్పుడు మామూలు పద్ధతుల్లో అయితే అది ఆ ఏడాదిలో తొలి సమావేశం కనక గవర్నర్ ప్రసంగంతో ప్రారంభం కావాలి. కానీ అప్పటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు గవర్నర్ ప్రసంగం లేకుండానే 2022 జనవరిలో బడ్జెట్ సమావేశాలు నిర్వహించారు. దీనిమీద తమిళసై బహిరంగంగానే అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది కొత్త అసెంబ్లీ సమావేశం కాదని అందువల్ల గవర్నర్ ప్రసంగం అవసరం లేదని కె.చంద్రశేఖర రావు ప్రభుత్వం వాదించింది. ఈ వాదనను గవర్నర్ అంగీకరించలేదు. మొత్తం మీద గవర్నర్ ప్రసంగం లేకుండానే బడ్జెట్ సమావేశాలు జరిగిపోయాయి. ఏడాది ఆరంభంలో జరిగే శాసనసభ సమావేశాలు గవర్నర్ ప్రసంగంతో మొదలు కావాలన్న సంప్రదాయానికి విఘాతం కలిగింది. ఈ విషయంలో గవర్నరుకు, ప్రభుత్వానికి మధ్య ఉన్న విభేదాలు ఎలా ఉన్నప్పటికీ గవర్నర్ ప్రసంగం లేనందువల్ల అంతకు ముందు సంవత్సరంలో ప్రభుత్వ పనితీరును బేరీజువేసే అవకాశం దక్కలేదు. ఒక సంప్రదాయానికి చెల్లు చీటీ రాసినట్టయింది. 2022లో బడ్జెట్ సమావేశాలకు ముందు గవర్నర్ ప్రసంగం ఉంటుందని చెప్పారని, చివరకు లేదన్నారని తమిళసై ఆందోళన వ్యక్తం చేశారు. అయితే తమిళసై బడ్జెట్ సమావేశాలను అనుమతించారు. లేకపోతే ఆర్థికబిల్లు శాసనసభలో ప్రవేశ పెట్టడానికి అవకాశమే ఉండేది కాదు. సహకార సమాఖ్య స్ఫూర్తిని పరిరక్షించడంకోసం బడ్జెట్ ప్రతిపాదనకు తాను అడ్డు చెప్పలేదని తమిళసై అప్పుడు వివరణ కూడా ఇచ్చారు. అంతకు ముందు కూడా కె.సి.ఆర్. ప్రభుత్వానికి, గవర్నరుకు మధ్య విభేదాలు తలెత్తాయి. పి.కౌశిక్ రెడ్డిని శాసనమండలి సభ్యుడిగా నియమించాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన సిఫార్సును గవర్నర్ ఆమోదించలేదు. శాసనమండలి ప్రోటెం స్పీకర్ నియామకంలో కూడా ప్రభుత్వానికి, గవర్నరుకు మధ్య విభేదాల కారణంగా జాప్యం అయింది. తమిళసై నేరుగా క్రియాశీల రాజకీయాల్లోంచి వచ్చిన వారే. ఇప్పుడూ ఆమె దక్షిణ తమిళనాడు నుంచి లోకసభకు పోటీ చేస్తారంటున్నారు. గవర్నర్ కాక ముందు తమిళసై 2007 నుంచి 2010వరకు బీజేపీలో అనేక బాధ్యతలు నిర్వహించారు. తమిళనాడు బీజేపీ అధికార ప్రతినిధిగా కూడా ఉన్నారు. 2019లో ఆమె తూత్తుకూడి నుంచి పార్లమెంటుకు పోటీచేసి డి.ఎం.కె. అభ్యర్థి కనిమోళి చేతిలో ఓడిపోయారు. గవర్నర్ల నియామకంలో రాజకీయ ప్రయోజనాలు, గవర్నర్ పదవిలో ఉన్న వారికి రాజకీయాలమీద మక్కువ తీరకపోవడం గవర్నర్ పదవినే ప్రశ్నార్థకం చేస్తోంది.

గడ్కరి తాటాకు చప్పళ్లు

రాజకీయాలు ఎప్పటికప్పుడు మారిపోతుంటాయి. మిత్రులు శత్రువులుగా మారడం, శత్రువులు మిత్రులుగా మారడం రాజకీయ రణరంగంలో నిత్య కృత్యం. రాజకీయ నాయకులు చేసుకునే విమర్శల ఆధారంగా వారి మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమంటుందని అనుకోవడం అమాయకత్వమే. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి ఇటీవలి కాలంలో ప్రధానమంత్రి మీద ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగా బోలెడు విమర్శలు గుప్పిస్తున్నారు. అయితే ఈ విమర్శలన్నీ అన్యాపదేశంగానే సాగుతున్నాయి. సకల కీలకాంశాల మీద మౌనంగా ఉండే ప్రధానమంత్రి మోదీ గడ్కరి విమర్శల మీద ఇంతవరకు నోరు విప్పలేదు. నోరు విప్పడం తనకే ప్రమాదకరం అని మోదీకి తెలుసు. గడ్కరీ స్థాయి నాయకులకు ప్రధానమంత్రి కావాలన్న ఆశ ఉండడంలో తప్పు లేదు. ఆశ్చర్యకరం అంతకన్నా లేదు. గడ్కరీకి ఆ కోరిక అంతరాంతరాల్లో ఉంది. తన ఆకాంక్ష తీరనందుకు నిరాశ, నిరుత్సాహం, చికాకు కూడా ఇటీవలి కాలంలో ఆయన మాటల్లో కనిపిస్తూనే ఉంది. అయితే గడ్కరీ సంధించే వాగ్బాణాలన్నీ తన మనసులో దాగి ఉన్న ఆకాంక్ష వ్యక్తం చేయడానికే తప్ప మోదీతో విధానపరమైన విభేదాలు కావవి. మోదీ ముందు మిగతా మంత్రుల్లా మోకరిల్లడానికి గడ్కరి సిద్ధంగా లేరు. మోదీ కనిపించగానే ఒంగి ఒంగి దండాలు పెట్టడం ఆయనతత్వం కాదు. దీనికీ ఒక కారణం ఉంది. మోదీ ఆర్.ఎస్.ఎస్. ప్రచారకుడిగా ఉండి మొదట గుజరాత్ ముఖ్యమంత్రి అయి ఆ పదవిలో పుష్కరం కన్నా ఎక్కువ కాలమే ఉన్నారు. హఠాత్తుగా 2014 ఎన్నికలకు ముందు మోదీ పేరు ప్రధానమంత్రి అభ్యర్థిగా ముందుకొచ్చింది. అప్పుడు నితీశ్ కుమార్ కూడా మోదీ అభ్యర్థిత్వాన్ని గట్టిగా వ్యతిరేకించిన వారే. ఆ తరవాత కనీసం రెండు సార్లు నితీశ్ కుమార్ బీజేపీని ఆలింగనం చేసుకున్నారు. నితీశ్ మోదీని

విమర్శించిన సందర్భాలలో సైద్ధాంతిక విభేదాలు ఉన్నాయనుకోవడానికి అవకాశాలు ఉన్నాయి. నితీశ్‌లో ఇప్పటికీ సోషలిస్టు భావజాలం ఏ మూలో మిగిలే ఉంది. కానీ నితిన్ గడ్కరీ పరిస్థితి అది కాదు. ఆయన సంఘ్ పరివార్ కుదురు నుంచి వచ్చిన వారే. అంతేకాదు ఆయనకు నాగపూర్‌లో ఆసీనులైన ఆర్.ఎస్.ఎస్. పీఠాధిపతుల ఆశీస్సులు దండిగా ఉన్నాయి. మోదీనే ఈ సారికూడా ప్రధానమంత్రి అభ్యర్థి అయితే బీజేపీకి గడ్డుకాలమే అని భావించే వారూ ఉన్నారు. కానీ మోదీ ఆర్.ఎస్.ఎస్.ను లెక్క చేసే స్థితిలో లేరు. ఆర్.ఎస్.ఎస్. సూచనలకు అనుగుణంగా నడుచుకోవడం లేదు. ఆర్.ఎస్.ఎస్. అధినేత మోహన్ భగవత్ అవకాశం వచ్చినప్పుడల్లా మోదీని ఆకాశానికి ఎత్తి తరించి పోతున్నారు. నితిన్ గడ్కరి అలా కాకుండా అవకాశం వచ్చినప్పుడల్లా మోదీని అన్యాపదేశంగానైనా ఎత్తి పొడుస్తున్నారు. తద్వారా మోదీ కాకపోతే తాను ఉన్నానని ఆర్.ఎస్.ఎస్. అధినేతలకు సూచన ప్రాయంగానైనా చెప్తూనే ఉన్నారు. మోదీ మీద గడ్కరీ విమర్శలు రాజకీయంగా తన ఆకాంక్షల వ్యక్తీకరణకు, ఎదుగుదలకు సంబంధించినవే తప్ప సైద్ధాంతిక విభేదాల జాడ లేశ మాత్రం కూడా లేదు. ఉదాహరణకు ఎన్నికల బాండ్ల విషయమే నిదర్శనం. ఎన్నికల బాండ్లు మోదీ మెదడులో పుట్టిన ఆలోచనే కావచ్చు. తద్వారా ఆయన బీజేపీ ఖజానా నింపి ఉండొచ్చు. ఎన్నికల బాండ్ల గురించి తన అభిప్రాయాలను గడ్కరీ ఇటీవల ఓ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అత్యంత స్పష్టంగానే చెప్పారు.

"ఎన్నికల్లో పోటీ చేయాలంటే డబ్బు కావాలిగా" అని నిర్మొహమాటంగానే చెప్పారు. ఈ బాండ్లను రద్దు చేస్తే నల్లధనం వీరవిహారం చేస్తుందన్నది ఆయన గట్టిగా నమ్ముతున్నారు. అక్కడికి ఎన్నికల బాండ్లు కొన్న వారు నల్లధనం పెట్టి కొనలేదని చెప్పే స్థితి లేదుగా! ఎన్నికల బాండ్లవల్ల ఆర్థిక వ్యవస్థ ఎగబాకుతుందనీ అన్నారు. ఇది కచ్చితంగా మోదీ ఆర్థిక విధానాలను సమర్థించడమే. ఎన్నికల్లో పోటీ చేయడానికి అన్ని పార్టీలకు డబ్బు కావాలిగా అంటున్నారు గడ్కరి. కానీ ఈ బాండ్ల వల్ల అత్యధిక ప్రయోజనం బీజేపీకే కలిగిందని ఆయనకు తెలియనంత అమాయకుడు ఏమీ కాదు. అయితే బాండ్లను సుప్రీంకోర్టు రద్దు చేయడం మీద వ్యాఖ్యానించకుండా గడ్కరి జాగ్రత్త పడ్డారు.

గడ్కరీకి మోదీకి మధ్య పొరపొచ్చాలు ఈ నాటివి కావు. ఆ విభేదాలు పుష్కర కాలం పై నుంచే సాగుతున్నాయి. మోదీ ప్రధానమంత్రి కాక ముందునుంచే ఉన్నాయి. 2011లోనే మోదీ వచ్చి ఉత్తరప్రదేశ్ లో ఎన్నికల ప్రచారం చేయవలసిన అవసరం ఏమీ లేదు అని గడ్కరి స్పష్టంగానే మనసులో మాట బయట పెట్టారు. అప్పటికి మోదీని ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించనైనా లేదు. ఆ సమయంలో గడ్కరి బీజేపీ అధ్యక్షుడిగా ఉండేవారు. మోదీ ఎన్నికల ప్రచార సభల వల్ల బీజేపీకి ఒరిగిందేమీ లేదని కూడా అంతకు ముందే వ్యాఖ్యానించిన విషయాన్ని గుర్తు చేసుకోవాలి. అప్పటికి బీజేపీ మాజీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సంజయ్ జోషీని ఉత్తరప్రదేశ్ ఎన్నికలకు ముందు సమన్వయకర్తగా నియమించాలని గడ్కరి అనుకున్నారు. అది మోదీకి నచ్చలేదు. ఆ సమయంలో మోదీ, గడ్కరి నెలల తరబడి ఫోన్‌లో కూడా మాట్లాడలేదంటారు. సంజయ్ జోషీ అంటే మోదీకి ముందు నుంచే ఇష్టం లేదు. కేశూభాయ్ పటేల్ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జోషీ బీజేపీ ప్రధాన కార్యదర్శిగా ఉండే వారు. ఆయన మోదీని ఢిల్లీకి పంపించారు. గుజరాత్ లో అడుగు పెట్టొద్దని కూడా ఆదేశించారు. మోదీ గుజరాత్ ముఖ్యమంత్రి అయిన తరవాత జోషి ఢిల్లీకి మకాం మార్చాల్సి వచ్చింది. జోషీకి మళ్లీ పార్టీ బాధ్యతలు అప్పగించిన తరవాత జాతీయ కార్యవర్గ సమావేశాలకు మోదీ హాజరయ్యే వారు కాదు. ఇలాంటి సందర్భాలు ఎన్ని ఉన్నా ప్రస్తుతం మోదీ చాలా బలమైన నాయకుడిగా ఉన్నారు. సంఘ్ పరివార్ కూడా ఆయనను నియంత్రించే స్థితిలో లేదు. అందుకే గడ్కరి విమర్శలను మోదీ పట్టించుకోవడం లేదు.

త్వరలో జరిగే ఎన్నికలలో బీజేపీకి భారీ విజయం కాకుండా అత్తెసరు మార్కులతో గట్టెక్కితే గడ్కరీకి మళ్లీ గొంతెత్తే అవకాశం ఉంటుందేమో! లేకపోతే గడ్కరీ విమర్శనాస్త్రాలు తాటాకు చప్పుళ్ల కిందే మిగిలిపోతాయి.

– అనన్య వర్మ

పార్టీల వ్యూహాల్లో సామాజిక న్యాయం మాయం

డాక్టర్ జీకేడీ ప్రసాద్

"కులం పునాదుల మీద ఒక జాతిని కాని, నీతిని కాని నిర్మించలేరు. కులం పునాదులపై జరిగిన ఏ నిర్మాణంలోనైనా పగుళ్లు ఏర్పడతాయి. అది దీర్ఘకాలం మన్నజాలదు" అన్నారు తన ఎన్హిలేషన్ ఆఫ్ క్యాస్ట్ గ్రంథంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్. దేశంలో నేడు ప్రభుత్వాల ఏర్పాటుకు కుల, మత సమీకరణలు కీలకపాత్ర పోషిస్తున్నాయన్న సంగతి అందరికీ తెలిసిన విషయమే. ధన, వస్తు ప్రవాహంతో ఓటర్లను ప్రలోభపెడుతున్నారని రాజకీయపార్టీలే పరస్పరం దూషించుకుంటున్నాయి. నీతి, నియమావళిని పక్కనబెట్టి గెలుపుకోసం రాజకీయపార్టీలు అడ్డదారులు తొక్కుతున్న సంగతిని ఆయా పార్టీ శ్రేణులే పరస్పరం విమర్శించుకుంటున్నాయి. దేశంలోనూ, రాష్ట్రంలోనూ ఎన్నికలు వస్తే డబ్బులొస్తాయని చూసే ఓటర్లు ఎక్కువ శాతం వున్నారని అభ్యర్థుల ఎన్నికల ఖర్చు చూస్తే తేటతెల్లం అవుతోంది. ధనికులు మాత్రమే ఎన్నికల్లో పోటీకి సమర్థులని పరిస్థితులు చెప్పకనే చెప్తున్నాయి. ఇదంతా జనరల్ సీట్లలోనే కాదు. ఎస్సీ, ఎస్టీల రిజర్వుడు స్థానాల్లో కూడా డబ్బుతో ఓట్లు కొనడం మరింత తీవ్రమైంది. అందుకు సమర్థులకే సీట్లు కేటాయిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీల్లో ఉన్నతాధికారులుగా పదవీ విరమణ చేసిన వారిని, లేదా సర్వీసులో వున్నవారి చేత రాజీనామా చేయించి మరీ బరిలోకి దించుతున్నారు. ఈ కులాల నుంచి ప్రజాప్రతినిధులుగా ఎన్నికయిన వారికి కొంతమంది బినామీలుగా వ్యవహరిస్తున్నారు. రిజర్వుడు స్థానాల్లో అభ్యర్థులు ఎన్నికల ఖర్చుకోసం కోట్లలో పెట్టుబడిపెట్టేవారి చేతిలో కీలుబొమ్మల్లా మారిపోతున్నారు. ఆధిపత్య కులాల చేతుల్లో వున్న పార్టీల్లోనే కాదు దళితపార్టీల అభ్యర్థుల విషయంలోను ఇదే ధోరణి. ఈ నేపథ్యంలో రాజకీయ రిజర్వేషన్లు సామాజిక న్యాయాన్ని ఎలా సాకారం చేయగలవో సమాధానం దొరకని ప్రశ్నగా మిగిలిపోతుంది. ఆర్థిక లావాదేవీల్లో, వ్యాపారాల్లో బినామీల్లానే రాజకీయ బినామీలు అవతరించారని అర్థం చేసుకోవాలి. ఇలాంటి సందర్భంలోనే గాంధీ, అంబేద్కర్ల మధ్య జరిగిన పునా ఒడంబడిక గుర్తుకొస్తుంది. ఆనాడు డాక్టర్ అంబేద్కర్ ఎందుకు ప్రత్యేక నియోజక వర్గాలను డిమాండ్ చేశారో తెలుస్తుంది. ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక నియోజకవర్గాలు దక్కకపోయినా మహాత్మాగాంధీ సమ్మతితో జనాభా ప్రాతిపదికన లభించిన స్థానాలు విషయంలో కూడా బినామీలు చొరబడి ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తున్నారంటే సామాజిక న్యాయం ఇంకెక్కడ లభిస్తుందనే ప్రశ్న ఎస్సీ, ఎస్టీ ప్రజల్లో నెలకొంది.

కులాధిపత్య పార్టీలు రాజ్యాంగస్ఫూర్తితో కాకుండా ఎస్సీ, ఎస్టీలకు నామమాత్రంగా సీట్లు కేటాయిస్తున్నట్టుగా ఎన్నికల ప్రక్రియ మారిపోయినట్టు కనిపిస్తోంది. రిజర్వుడు స్థానాల నుంచి ఎంపికయిన

అభ్యర్థులకు సొంత ఎజెండా ఏమీ లేకుండా పోతోంది. ఆయా పార్టీల మేనిఫెస్టోతోనే పెనవేసుకుపోవాలి. ఏది ఆచరణలోకి రాకపోయినా నోరు విప్పడానికి లేదు. ఎస్సీ, ఎస్టీలకు అత్యవసరమయిన సంక్షేమ పథకాల్ని తీసేసినా, మార్పు చేసినా మాట్లాడటానికి వీలులేదు. రిజర్వేషన్లు తగ్గించినా, అంచెలంచెలుగా తొలగిస్తున్నా తల ఊపాల్సివస్తుంది. లాభాల్లో నడుస్తున్న ప్రభుత్వ రంగ పరిశ్రమలు, సంస్థలు ప్రైవేటు రంగంలోకి మారిపోవడాన్ని అలా చూస్తూ ముందుకు సాగిపోవాలి. పాఠశాల విద్య నుంచి విదేశీ విద్య వరకు మనుగడలో వున్న సంక్షేమాన్ని తలకిందులు చేసినా ప్రభుత్వ వైఖరిని ఖండించడానికి లేదు. గోడలకు సున్నాలేసి అభివృద్ధి అనిపేరు పెడితే జేజేలు కొట్టుకుంటూ తిరగాలి. రాజకీయ బినామీలు ఎక్కడో మారుమూల గ్రామాల్లో సర్పంచ్‌లు మాత్రమే కాదు. అత్యున్నత చట్టసభల్లో కూడా ఇదే తీరు కొనసాగుతోంది. రోజు రోజుకూ ఈ పరిస్థితి తీవ్రమవుతోంది. దళిత పార్టీలు, దళితేతర పార్టీలతో పొత్తు పెట్టుకున్న సందర్భాల్లో కూడా ఓటు బదిలీ విషయంలో సమస్యలు తలెత్తుతున్నాయి. దళిత పార్టీల నుంచి దళితేతర పార్టీలకు ఓటు బదిలీ అయిన శాతం కంటే దళితేతర పార్టీల నుంచి దళిత పార్టీలకు చాలా తక్కువ ఓటు శాతం మాత్రమే బదిలీ అవుతుంది. 2017 ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో సమాజ్‌వాది, బీఎస్పీ పొత్తు సందర్భంలో ఇదే జరిగింది. వీటికి తోడు

పెత్తందారీలు, ఆధిపత్య కులాల నాయకులు స్థానిక ఎస్సీ, ఎస్టీ ప్రజల్ని ప్రజాప్రతినిధులుగా సహించలేక స్థానికేతర అభ్యర్థులను తీసుకొచ్చి పోటీలో నిలుపుతున్నాయి. ఉపకులాలకు సీట్ల సర్దుబాటు విషయంలో కూడా ఆధిపత్య ధోరణికి పాల్పడుతున్నారు. ఈ విధంగా కూడా ఎస్సీ, ఎస్టీల రాజకీయ రిజర్వేషన్లను రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా మలుస్తున్నారు. మాలలు అధికంగా వున్న చోట మాదిగ ఉపకులానికి చెందిన అభ్యర్థిని, మాదిగలు అధికంగా వున్న చోట మాల కులానికి చెందిన అభ్యర్థిని పోటీలో నిలుపుతున్నారు. ఈ ధోరణి కూడా కులాల మధ్య కుంపటిగా మారుతోంది. ఇలాంటి పరిస్థితుల్ని సృష్టించి తమ గెలుపుకి అనుకూలంగా మార్చుకుంటున్నారు. ప్రభుత్వాల్ని నడిపిన పార్టీలదీ, నడుపుతున్న పార్టీలదీ ఎస్సీ, ఎస్టీల పట్ల ఒక ధోరణి అయితే ఇక సామాజిక న్యాయం ఎప్పుడు చేరువవుతుంది? అనే ప్రశ్న ఆయా వర్గాల్లో తలెత్తుతుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఇన్‌చార్జి మంత్రుల్ని నియమించినప్పటికీ వారిని నామమాత్రంచేసి పార్టీ ఇన్‌ఛార్జిలే పెత్తనం చెలాయిస్తున్నారు. పైగా వీరంతా ముఖ్యమంత్రి సామాజికవర్గం, బంధువర్గం కావడం విశేషం. అఖిలభారతస్థాయి ఉన్నతాధికారులు సైతం ఇన్‌ఛార్జులకు అడుగులకు మడుగులెత్తుతున్నారనే భావన కింది స్థాయి ఉద్యోగుల్లో సైతం తీవ్రకలకలమే రేపింది. అయినప్పటికీ ఆ పార్టీ శ్రేణులు ఎదురుదాడి చేశాయే తప్ప తమ ప్రవర్తన సరిదిద్దుకోలేదు. ప్రసారమాధ్యమాలతో పాటు న్యాయస్థానాల్ని కూడా లెక్కచేయలేదు. రిజర్వుడు నియోజకవర్గాల్లో ఎస్సీ, ఎస్టీయేతర

వ్యక్తులను ఇన్‌ఛార్జులుగా నియమించడం కొసమెరుపు. ఎమ్మెల్యేలను పక్కనబెట్టి ఇన్‌ఛార్జులే పెత్తనం చేయడం రాజ్యాంగస్ఫూర్తికే వ్యతిరేకం. పైగా ఇది ప్రజాస్వామ్యానికి ముప్పు కూడా అనే విశ్లేషణలు వింటున్నాం. ఇలాంటి సందర్భాల్లో రిజర్వేషన్ల మనుగడ మీద ఆందోళన రేకెత్తుతుంది. ఈ సందర్భంగా మరొక్కసారి రాజ్యాంగ పరిషత్ చర్చలను గుర్తు చేసుకోవలసి వస్తుంది. రాజకీయ రిజర్వేషన్లు పదేళ్లు సరిపోతుందన్న పరిషత్ సభ్యుల నిర్ణయాన్ని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అంగీకరించవలసివచ్చింది. సామాజిక అభివృద్ధి అంతా పదేళ్లలో జరిగిపోతుందని పరిషత్ సభ్యులు భావించారు. కాని అలా జరగలేదు. చట్టసభల్లో చోటు సంపాదించిన ప్రజాప్రతినిధులు రాజ్యాంగంలో రాసినట్టు సమాజాన్ని మార్చలేకపోయారు. ప్రభుత్వాల వైఫల్యాలు, పార్టీల చేష్టల కారణంగా రిజర్వేషన్లను పదే పదే యధావిధిగా పొడిగించవలసివస్తూవుంది. ఇదే ధోరణి కొనసాగితే అట్టడుగు, అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం జరిగేదెప్పుడు? అందరికీ సమానావకాశాలు దక్కేదెప్పుడు? సమాధానం దొరకని ప్రశ్నలుగానే మిగిలిపోతున్నాయి. అందుకే ఈ వర్గాలకు సత్వర న్యాయం చేకూర్చడం కోసం ప్రభుత్వాలు రాజ్యాంగంలో పొందుపరిచిన అన్ని రక్షణలను పగడ్బందీగా అమలు చేయవలసిన అవసరం ఎంతైనా వుంది. అడ్డంకుల్ని కఠినంగా ఎదుర్కోవలసిన గురుతర బాధ్యత కూడా వుంది

దేశాన్ని భ్రష్టు పట్టించినందుకా మళ్లీ అవకాశం ?

డా. జి.వెన్నెల గద్దర్

ఎన్నికల కోడ్ రానే వచ్చింది వలస పక్షులు ఇప్పుడిప్పుడే గూళ్లను వెదుక్కుంటూ కుదుటపడుతున్నాయి. బీజేపీ అధికారంలోకి రాకముందు 370 రూపాయలు ఉన్న గ్యాస్ సిలెండర్ 2022లో 1200 రూపాయలైంది, అరవై రూపాయల ఉన్న పెట్రోల్, డీజిల్ రేట్లు రూ.110 కి పెంచి గత వారంలో రెండు రూపాయలు చొప్పున తగ్గించి భారీ వితరణ చాటుకున్నారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. బూటకపు వాగ్దానాలు, బూటకపు గ్యారెంటీతో అప్పనంగా వచ్చిన డబ్బును టీవీ సామాజిక మాధ్యమాలలో ప్రకటనల కోసం తగలేస్తున్నారు. పూట పూటకు ఖరీదైన దుస్తులు ధరించి విలాసవంతమైన హోటళ్లు, విమానాలలో తిరుగుతూ పగటి వేష గాడిని తలదన్నే మాటలు... చేతలు శూన్యంగా ఉంది. చిలకలూరిపేటలో జరిగిన సభలో ఆంధ్రప్రదేశ్‌కు తాను ఏమి చేస్తారో, ఏం ఇస్తారో చెప్పలేదు. 2019లో తాను శంకుస్థాపన చేసిన అమరావతి నాశనం అయితే దాని గురించి ఒక్క మాట మాట్లాడలేదు. పది సంవత్సరాల క్రితం ఇతర దేశాల్లో ఉన్న నల్ల డబ్బు తెచ్చి ఒక్కో మనిషికి 15 లక్షలు ఇస్తానన్న సంగతి మరచిపోయారు. సమాన విద్యావకాశాలు లేని నూతన విద్యావిధానాన్ని ప్రవేశపెట్టి కాషాయీకరణ, వ్యాపారీకరణ, కేంద్రీకరణకు పెద్ద పీట వేస్తున్నారు. ఒక్కటంటే ఒక్క పరిశోధన సంస్థను స్థాపించింది లేదు, కేంద్ర విశ్వవిద్యాలయాలలో పేరెన్నికగల సంస్థలలో ఉద్యోగ క్షీణత నలభై శాతం దాటింది. రాజ్యాంగం నుంచి లౌకికవాదాన్ని తొలగిస్తారన్న భయాన్ని తొలగించలేదు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేయడం గురించి ప్రస్తావించరు. 67 ఏళ్ల అప్పులు రూ.55 లక్షల కోట్లు అయితే మోదీ ఒక్కరే చేసిన అప్పులు రూ. 80 లక్షల కోట్లు గురించి మాట్లాడరు. పెట్రోల్ ధర రూపంలో దోచుకున్న రూ.26 లక్షల కోట్లు గురించి, ఎలక్టోరల్ బాండ్ల ద్వారా వసూలు చేసిన 6900 కోట్ల రూపాయల గురించి నోరుమెదపరు. వ్యాపారస్తులు, కార్పొరేట్లు ఎగవేస్తున్న ఆదాయపు పన్ను గురించి చట్టసభలలో చర్చలేదు. కరోనా ప్యాకేజీ 20 లక్షల కోట్లు, పీఎం కేర్స్ ఫండ్‌కు వచ్చిన విరాళాల గురించి, ఎనిమిది వేల కోట్లతో విమానానికి తగలేయడం, కార్పొరేటు ప్రైవేటు ఆసుపత్రులు కరోనా టైంలో 6 లక్షల కోట్ల దోపిడి గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. మూతపడుతున్న ప్రభుత్వ రంగ సంస్థల గురించి ఏనాడూ చింతించలేదు. హిడెన్ బర్గ్ రిపోర్టు ద్వారా గత సంవత్సరం స్టాక్ మార్కెట్లో సామాన్య మదుపరుల ఆస్తి లక్షల కోట్లు ఆవిరైపోయినా పట్టించుకోలేదు. ఇరవై లక్షల కోట్లు కార్పొరేట్ ఎగవేతదారుల రుణాలను మాఫీ చేయడం, అదానీ ఆస్తులు గత పది సంవత్సరాలలో 26 రెట్లు పెరగడం, కరోనా సమయంలో అంబానీ ఆస్తి గంటకు 90 కోట్లు

పెరగడం చూస్తుంటే మోదీ ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాడో అర్థం అవుతుంది. గిట్టుబాటు ధరలు లేక ప్రతిరోజు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా చీమ కుట్టినట్లు లేకుండా రోజు రాష్ట్రాల వెంట తిరుగుతూ పూటకొక డ్రెస్ మార్చి 400 కి పైగా సీట్లు వచ్చేందుకు మాకు ఓట్లు వేయండి అని అభ్యర్థిస్తున్నారు. దేశంలో ఓబీసీల్లో 983 కులాలకు ఐదేళ్లుగా ప్రభుత్వపరంగా ఎలాంటి ప్రయోజనాలు అందట్లేదు. మోదీ నేతృత్వంలో చేతగాని పాలన సాగుతోంది, వ్యవస్థలన్నీ పతనమై పోయాయి, నిరుద్యోగం 8.4 శాతం పెరిగింది. ప్రభుత్వ రంగ సంస్థలు దివాళా తీసేలా చేస్తున్నారు. బీమా, రైల్వే, కమ్యూనికేషన్, చివరికి ఇస్రో, హెచ్ఏఎల్ ప్రైవేటు పరం చేస్తున్నారు. ఆయన ఏదో చేస్తున్నారన్న భ్రమ నుంచి ప్రజలు బయట పడాలి. బహుజనులలోని అన్ని కులాలు ఏకతాటిపైకి వచ్చి రాజకీయంగా బలపడాలి. దేశ జనాభాలో 54% బీసీలే ఉన్నప్పటికీ రాజకీయాల్లో మాత్రం రిజర్వేషన్లు ఇవ్వకపోవడం బాధాకరం. కులాల లెక్కలు తీయకపోతే బీజేపీ గద్దె దిగి పోవాల్సిందే. ఇప్పటివరకు వారి వాటాతో పాటు బీసీలకు వచ్చే వాటా కూడా అనుభవిస్తున్నారు. కులం పేరుతో వివక్షకు గురైన వర్గాల వారికి సమ ప్రాతినిధ్యం దక్కించడం కోసమే రిజర్వేషన్ల వ్యవస్థ" అని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(4) , 16(4) లో స్పష్టంగా పేర్కొన్నారు. ఆర్థిక ప్రాతిపదికన ఇవ్వాల్సినవి సంక్షేమ పథకాలు మాత్రమేనని, ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు ఈబీసీ వర్గాలకు ఎక్కడ నుంచి వచ్చింది. రిజర్వేషన్‌కు ప్రాతిపదిక కులం (సామాజిక వెనుకబాటు) మాత్రమే, కేంద్రంలో బీజేపీ ఉన్నప్పటి నుంచి అంతా తారుమారు అవుతుంది. మండల్ కమిషన్ నివేదిక ప్రకారం ఓబీసీల జనాభా 54%, అగ్రకులాల జనాభా ఎంత అనేది తెలియకుండా వారికి పది శాతం రిజర్వేషన్లా?

అసలు ఎందుకు వెయ్యాలో చెప్పలేదు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం లాంటి మీడియా అధికారంలో ఉన్న ప్రభుత్వాలకు అనుకూలంగావుంటూ కేవలం తమ స్వార్థం కోసం ఊకదంపుడు ఉపన్యాసాలను షేర్ చేస్తున్నది. నిజంగా దేశభక్తి కలిగిన వారయితే, దేశాభివృద్ధి కోరే వారయితే అది నీవైన, నేనైన లేదా ఇంకెవరైనా సరే కుల మతాలకతీతంగా పై అంశాల వంటి వాటి సాధన కోసం పాటుపడాలి. ఇక మోదీ భక్తుల చూపంతా దేవుడు, రామ మందిరం, మతం, కులం, హలాల్, హిజాబ్, మసీదు, జట్కా, ఆవు, పాకిస్థాన్, చైనా, బంగ్లాదేశ్, క్రికెట్, వాట్సాప్ సామాజిక మాధ్యమాలలో పైసా ఖర్చు లేకుండా వీటిని ప్రచారం చేస్తున్నారు. ఆంధ్రలో బీజేపీకి తగిన పునాది లేదు. ఇలాంటి పార్టీకి చంద్రబాబు నాయుడు ఆరు ఎంపీ సీట్లు, పదికి పైగా ఎమ్మెల్యే సీట్లు ఇస్తున్నారు. అన్నదమ్ముల వలే కలిసి ఉన్న ప్రజల మధ్య మతం అంటూ చిచ్చు పెట్టి పైశాచిక ఆనందం పొందుతున్న బీజేపీకి ఆంధ్రప్రదేశ్‌లో పునాదులు కడుతున్నాడు చంద్రబాబు. టీడీపీలో ఉన్న ముస్లిం సోదరులు ఇప్పటికి అయినా కళ్లు తెరవాలి. ఒక్కసారి బీజేపీ పరిపాలిస్తున్న రాష్ట్రాలను చూడండి. ముస్లిం మహిళలను ఎంత ఇబ్బంది పెట్టారో తెలుస్తుంది. హత్రాస్, బిల్కిస్ బానో కేసు విషయంలో, రెజ్లర్ల లైంగిక వేధింపుల విషయంలో బీజేపీ ధోరణి చూస్తూనే ఉన్నాం. బీజేపీతో పొత్తు పెట్టుకున్న చంద్రబాబు నాయుడికి బుద్ధి చెప్పండి. చంద్రబాబు బీజేపీ ఓటమి ఎలా ఉండాలి అంటే మళ్లీ రాష్ట్రం వైపు బీజేపీ కన్నెత్తి చూడకుండా ఉండాలి. బీజేపీ నేతలు తమకు 370 సీట్లు సొంతంగానే వస్తాయంటున్నారు. ఆర్టికల్ 370 రద్దు స్ఫురణకు తెస్తూ సొంతంగా 370 వస్తాయని ఊదర గొడుతున్నారు. కేవలం ప్రతిపక్షాల ఆత్మస్థైర్యాన్ని దెబ్బ కొట్టడానికి చేస్తున్న వ్యాఖ్యలు తప్ప వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నం అని రాజకీయ పరిజ్ఞానం ఉన్నవారందరికీ తెలిసిందే. ఉత్తర భారత్‌లో రాష్ట్రాల పరిస్థితి గమనిద్దాం. 80లోక్‌సభ స్థానాలున్న ఉత్తరప్రదేశ్ బీజేపీకి ఆయువు పట్టు. గత ఎన్నికల్లో బీజేపీ ఎన్‌డీఏలోని ఏడీ(ఎస్)తో కలుపుకుని బీజేపీ పొందినవి 64 సీట్లు. గుడి కట్టేశాం కాబట్టి రాముడు తమను కాపాడుతాడు అనేది వారి ఆశ, ఆలోచన. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు పూర్తి భిన్నం. గత పదేళ్లుగా అక్కడ జరిగిన అభివృద్ధి శూన్యం. ఆ రాష్ట్రం నుంచి పన్నుల రూపంలో జాతీయ ఆదాయానికి వచ్చిన సొమ్ములో రెండింతలకన్నా ఎక్కువగా అక్కడికే తరలించినా ప్రగతి లేదు. రాష్ట్రమంతా నిరుద్యోగం విలయ తాండవం చేస్తోంది. ఇటీవల పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు విడుదలైన ప్రకటనలో 60 వేల ఉద్యోగాలకు 50 లక్షల మందికి పైగా అభ్యర్థులు పోటీ పడుతున్నారంటే అక్కడి నిరుద్యోగ పరిస్థితి ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. పేదరికం తగ్గకపోగా ఉచిత బియ్యం పొందే జనాభా పెరిగింది. పులి మీద పుట్రలా నిత్యావసరాల ధరల పెరుగుదల జనాగ్రహానికి కారణవుతున్నది. ఇది ఎక్కడా బయటకు కనిపించని ధర్మాగ్రహం. సామాన్యుడు నిత్యం తన ఆగ్రహాన్ని వ్యక్తం చేయడు. తన చేతికి చిక్కే ఓటు అవకాశం మాత్రం వదులుకోడు. ఇక బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఢిల్లీలో ఎదురు గాలి వీస్తున్న మాట నిజమవుతుంది. మతసామరస్యం, శాంతి, సౌభ్రాతృత్వం ప్రతి మనిషి జీవన విధానం కావాలని ప్రజలు గ్రహించినప్పుడే పరిస్థితి మారుతుంది. మత విద్వేషాలను ప్రేరేపించే విధానాలు దేశ సార్వభౌమత్వానికి ప్రమాదకరమని ప్రజలు గ్రహించాలి. మెరుగైన సమాజానికి మూలస్తంభాలైన విద్య, వైద్యం, వ్యవసాయం, పర్యావరణం, సాధికారత, విలువలు, సామాజిక సమగ్రతను ప్రజలు విస్మరించి కేవలం మతం పట్టుకుని వేలాడడం తీవ్ర ప్రమాదం అని గ్రహించాలి. మతోన్మాదం మెజారిటీ తరహా అయినా, మైనారిటీ తరహా అయినా ప్రమాదకరమే. అన్ని రకాల మతోన్మాదాన్ని నిశితంగా వ్యతిరేకించాలి, ప్రతిఘటించాలి. బీజేపీ ప్రభుత్వ విధానాలు, సంఘ పరివార్ కార్యక్రమాలు లౌకికతత్వం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం పునాదులను ధ్వంసం చేస్తున్నాయి. సంఘపరివార్ శక్తుల విభజనవాద, ఫాసిస్టు తరహా చర్యలు శ్రామిక ప్రజల వర్గ ఐక్యతను, దేశ సమగ్రతను దెబ్బ తీస్తుంది.

కర్నాటక బీజేపీలో భగ్గుమన్న అసంతృప్తులు

టికెట్ దక్కకపోవడంతో సీనియర్ల గుర్రు

కాంగ్రెస్ వైపు చూపు

బెంగళూరు: లోక్‌సభ ఎన్నికల వేళ కర్నాటక బీజేపీలో అసంతృప్త జ్వాలలు రగులుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాలో తమ పేరు చోటుచేసుకోకపోవడం, తమను దూరంగా ఉంచడంపై కొంతమంది బీజేపీ అగ్రనేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 20 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను బీజేపీ విడుదల చేసింది. అందులో చోటుదక్కని ఆ పార్టీ సీనియర్ నేతలు సదానంద గౌడ, కేఎస్ ఈశ్వరప్ప, కరాడి సంగన్న తదితరులు అధిష్ఠానంపై ఆగ్రహం వెలిబుచ్చారు. బెంగళూరు నార్త్ నుంచి తనకు టికెట్ నిరాకరించడానికి ముందే ఎన్నికల రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు కేంద్ర మాజీ మంత్రిగా ఉన్న సదానంద గౌడ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆ తర్వాత ఆయన యూ-టర్న్ తీసుకొని... ఎన్నికల్లో పోటీ చేయాలంటూ తనపై ఒత్తిడి వస్తోందని చెప్పుకొచ్చారు.

కాంగ్రెస్ పార్టీలో చేరే ఆలోచన ఉందన్న సంకేతాలు సైతం ఇచ్చారు. బీజేపీ నేతలే కాదు... కాంగ్రెస్ వాళ్లు కూడా తనను అడుగుతున్నారని, సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. బెంగళూరు నార్త్ నుంచి కేంద్ర మంత్రి శోభా కరాంద్లాజేకు బీజేపీ సీటు ఇచ్చింది. సదానంద గౌడకు ఒక్కలిగ సామాజిక వర్గంలో బలమైన నేతగా పేరుంది.

కాగా, హవేరీ నుంచి తన కుమారుడికి సీటు ఇవ్వకపోవడంతో మాజీ ఉప ముఖ్యమంత్రి కేఎస్ ఈశ్వరప్ప అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మైని ఆ సీటులో బీజేపీ నిలబెట్టింది. తన కుమారుడికి టికెట్ ఇవ్వకుండా మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప అడ్డుపడినట్టు ఈశ్వరప్ప ఆరోపించారు. యడియూరప్ప కుమారుడు బీవై రాఘవేంద్రపై శివమొగ్గ నుంచి తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ఆయన ప్రకటించారు. బీజేపీకి అనుకూలంగా పనిచేయడానికి ప్రజలు, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నప్పటికీ వ్యవస్థ మాత్రం చాలా చెడ్డగా ఉందని ఈశ్వరప్ప ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఒక కుటుంబానికే పరిమితమైందని ప్రధాని చెబుతుంటారని, కర్నాటక బీజేపీలోనూ ఇదే పరిస్థితి ఉందని ఆయన ఘాటుగా విమర్శించారు. కర్నాటక బీజేపీ కూడా ఒక కుటుంబం అధీనంలో ఉందని, దీనిని తాము నిరసిస్తున్నామని చెప్పారు. కొప్పల్ నియోజకవర్గం నుంచి రెండుసార్లు (2014, 2019) బీజేపీ ఎంపీగా ఉన్న కరాడి సంగన్న...తనకు ఈసారి టికెట్ నిరాకరించడంపై ఆగ్రహంతో ఉన్నారు. కొప్పల్ నుంచి డాక్టర్ బసవరాజ్ క్యవటర్‌కు బీజేపీ టికెట్ ఇచ్చింది. దీంతో కరాడి సంగన్న కాంగ్రెస్‌కు దగ్గరవుతున్నారనే సంకేతాలు వెలువడ్డాయి. ప్రస్తుతానికైతే తాను ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, పార్టీ నేతలతో సమావేశమై పార్టీలో ఉండాలా కాంగ్రెస్‌లో చేరాలా అనే దానిపై నిర్ణయం తీసుకుంటామని సంగన్న తెలిపారు. తుంకూరు నియోజకవర్గం నుంచి వి.సోమన్నను పార్టీ అభ్యర్థిగా బీజేపీ ప్రకటించడంతో మాజీ మంత్రి జేఎస్ మధుస్వామి కూడా అసంతృప్తితో ఉన్నారు. యడియూరప్ప తనకు బాసటగా నిలవకపోవడం, తన అభ్యర్థిత్వాన్ని బలపరచకపోవడం బాధాకరమని ఆయన వ్యాఖ్యానించారు. పార్టీలో తనకు రక్షణ లేనప్పుడు ఇంకా ఇక్కడే కొనసాగాలా వద్దా అనే దానిపై కార్యకర్తలను సంప్రదించి తదుపరి నిర్ణయం తీసుకుంటానని మధుస్వామి తెలిపారు.

కాంగ్రెస్‌లో పప్పూయాదవ్ పార్టీ విలీనం

పాట్నా: లోక్‌సభ ఎన్నికలవేళ బీహార్‌లో ప్రాంతీయ పార్టీ అయిన జన్ అధికార్ పార్టీ కాంగ్రెస్ పార్టీలో విలీనం అయింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ హామీ మేరకు పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశామని జన్ అధికార్ పార్టీ అధినేత రాజేశ్ రంజన్ అలియాస్ పప్పు యాదవ్ ప్రకటించారు. దీంతో బీహార్‌లో కాంగ్రెస్ పార్టీకి మరింత బలం చేకూరినట్లయింది. కాంగ్రెస్, ఆర్జేడీ కలిసి పోటీ చేయడం వల్ల లోక్ సభ ఎన్నికల్లో విజయం సాధించడం ఖాయం అని పప్పు యాదవ్ విశ్వాసం వ్యక్తం చేశారు. లోక్ సభ ఎన్నికల తర్వాత బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్-ఆర్జేడీ కూటమి విజయం సాధిస్తోందని ధీమా వ్యక్తం చేశారు. కాగా పప్పూయాదవ్‌ను లోక్ సభ ఎన్నికల బరిలో నిలుపాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. కాంగ్రెస్ పార్టీలో తన పార్టీని విలీనం చేయడానికి ముందు ఆర్జేడీ అధినేత లాలు ప్రసాద్ యాదవ్, అతని కుమారుడు తేజస్వీయాదవ్‌తో పప్పూయాదవ్ సమావేశం అయ్యారు. అనంతరం తమకు ఒకరిపై మరొకరికి శత్రుత్వం లేదని పప్పూయాదవ్ స్పష్టం చేశారు. బీహార్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తానని ఈ సందర్భంగా పప్పూయాదవ్ ప్రకటించారు. తేజస్వీ యాదవ్‌పై ప్రశంసలు కురిపించారు. గత 17 నెలల బీహార్ పాలనలో తేజస్వీయాదవ్ మార్క్ కనిపించిందన్నారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పని చేశారని తెలిపారు.

నన్ను క్షమించండి: కేంద్ర మంత్రి

బెంగళూరు: రామేశ్వరం కెఫే బాంబు పేలుడు కేసులో నిందితుడికి సంబంధించిన ప్రాంతం గురించి కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. దాంతో మంత్రి క్షమాణలు చెప్పాల్సివచ్చింది. తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటున్నట్లు పోస్టు పెట్టారు. ఇంతకీ ఏం జరిగిందంటే... నిందితుడు మల్నాడు వాసి అని, గతంలో తమిళనాడులోని కృష్ణగిరి అటవీ ప్రాంతంలో ఆయుధాలను వినియోగించడంలో ఇచ్చే శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నాడని ప్రాథమికంగా తేలింది. దాంతో మంత్రి చేసిన వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. ముఖ్యమంత్రి స్టాలిన్ అనుసరిస్తున్న బుజ్జగింపు రాజకీయాలే కారణమంటూ విమర్శలు చేశారు. ఈ ఆరోపణలపై స్టాలిన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆమెపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తన వ్యాఖ్యలు దుమారం రేపడంతో సామాజిక మాధ్యమాల వేదికగా ఆమె క్షమాపణలు తెలియజేశారు. 'నేను చేసిన వ్యాఖ్యలు ఏ ఒక్క వర్గాన్ని ఉద్దేశించినవని కాదని తమిళనాడు ప్రజలకు స్పష్టత ఇవ్వాలని అనుకుంటున్నాను. కృష్ణగిరిలో శిక్షణ పొందిన నిందితుడిని ఉద్దేశించే నేను మాట్లాడాను. అయితే నా మాటలు కొందరిని బాధించాయని అర్థమైంది. అందుకు క్షమాపణలు తెలియజేస్తున్నాను. నా వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నాను' అని ఆమె పోస్టు పెట్టారు. ఈ నెల ఒకటిన బెంగళూరులోని బ్రూక్‌ఫీల్డ్‌లో ఉన్న రామేశ్వరం కెఫేలో బాంబు పేలిన ఘటనలో తొమ్మిది మంది గాయపడిన సంగతి తెలిసిందే.

తప్పుడు ధ్రువీకరణతో 21 లక్షల సిమ్ కార్డులు

న్యూదిల్లీ: దేశవ్యాప్తంగా తప్పుడు ధ్రువీకరణలతో సుమారు 21 లక్షల సిమ్‌కార్డులు జారీ అయినట్లు తమ విశ్లేషణలో తేలిందని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ తెలిపింది. ఈ మేరకు ఎయిర్‌టెల్, ఎంటీఎన్ఎల్, బీఎస్ఎన్ఎల్, జియో, వొడాఫోన్ సంస్థలకు అలర్ట్ జారీ చేసినట్లు వెల్లడించింది. కొన్ని అనుమానాస్పద నంబర్ల జాబితాను విడుదల చేసి వాటి పత్రాలను తక్షణమే రీవెరిఫికేషన్ చేయాలని ఆదేశించినట్లు చెబుతోంది. ఒకవేళ అవి బోగస్ ధ్రువీకరణ అని తేలితే సిమ్‌లు రద్దు చేయాలని పేర్కొంది. సంచార్ సాథీ కార్యక్రమం కింద దేశ వ్యాప్తంగా 114 కోట్ల మొబైల్ కనెక్షన్లను డీవోటీకి చెందిన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డిజిటల్ ఇంటెలిజెన్స్ విభాగం విశ్లేషించింది. వీటిల్లో 21 లక్షల సిమ్ కార్డులను యాక్టివేట్ చేసుకోవడానికి తప్పుడు ధ్రువీకరణ పత్రాలను సమర్పించినట్లు గుర్తించింది. వీటిలో చాలా సిమ్‌లను సైబర్ నేరాలకు వాడుతున్నట్లు అనుమానిస్తోంది. ఇవి నిరూపితమైతే ఆ సిమ్ కార్డును రద్దు చేయడంతోపాటు, దానిని వినియోగించిన ఫోన్‌ను కూడా పనిచేయకుండా చేస్తామని ఏఐ అండ్ డీఐయూ డైరెక్టర్ జనరల్ ముఖేశ్ మంగళ్ వెల్లడించారు. దేశ వ్యాప్తంగా 1.92 కోట్ల మంది తొమ్మిది సిమ్‌కార్డుల పరిమితికి మించి కనెక్షన్లు తీసుకొన్నారు. వీరిలో చాలా మంది సర్వీసు ప్రొవైడర్లకు ఇచ్చిన డేటాలో చాలా తప్పులున్నాయి. ప్రజలకు తెలియకుండా వారిపేరిట తీసుకొనే సిమ్‌కార్డులను గుర్తించి వాటిని రద్దు చేయించడానికి సంచార్ సాథీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ నెంబర్లపై దర్యాప్తు సహా ఇతర చర్యలకు డీవోటీ ఇప్పటికే సర్వీసు ప్రొవైడర్లకు డెడ్‌లైన్ విధించింది. వీటిని పూర్తిచేసే క్రమంలో భారీ సంఖ్యలో సిమ్‌కార్డులు డిస్‌కనెక్ట్ అవుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఇక ఈ మొత్తం ఆపరేషన్‌లో ఏఐ అండ్ డీఐయూ సంస్థ ఇతర చట్ట సంస్థలతో కలిసి పనిచేస్తోంది. ఇప్పటి వరకు 1.8లక్షల మొబైల్ హ్యాండ్‌సెట్లను పనిచేయకుండా చేశామని అధికారులు చెబుతున్నారు. మరోవైపు తమిళనాడు డీజీపీ శంకర్ జివాల్ మాట్లాడుతూ 90 శాతం సైబర్ నేరాలకు తప్పుడు సిమ్‌కార్డులనే వాడుతున్నట్లు పేర్కొన్నారు. పోలీసులు తమను ట్రాక్ చేయడానికి వీల్లేకుండా వారు వీటిని వినియోగిసున్నారన్నారు.

నకిలీ ఎన్‌కౌంటర్ కేసు...

పోలీసు అధికారికి జీవిత ఖైదు

ముంబై: నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో మహారాష్ట్రకు చెందిన మాజీ పోలీసు అధికారి ప్రదీప్‌శర్మకు జీవితఖైదు పడింది. 2006లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో గ్యాంగ్‌స్టర్ చోటా రాజన్ అనుచరుడు రామ్‌నారాయణ్ గుప్తాను ప్రదీప్ కాల్చి చంపిన కేసులో ఆయనకు ఈ శిక్ష ఖరారుచేశారు. ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా వందమందికి పైగా గ్యాంగ్‌స్టర్లను మట్టుపెట్టి, ఇప్పుడు దోషిగా మిగిలారు. ప్రదీప్ శర్మ 1983లో పోలీసు ఉద్యోగంలో చేరారు. ముంబై అండర్‌వర్ల్డ్ డాన్ చోటా రాజన్, ఇతర గ్యాంగ్‌స్టర్లకు చుక్కలు చూపించారు. ఒకే ఏడాదిలో రాజన్ అనుచరుడు వినోద్ మట్కర్, దావూద్ ఇబ్రహీంకు చెందిన డీ-కంపెనీ గ్యాంగ్‌స్టర్ సాదిఖ్ కాలియాను ఎన్‌కౌంటర్లలో కాల్చిచంపారు. 2003లో లష్కరేతొయిబా అనుమానితులను శర్మ బృందం మట్టుపెట్టింది. అయితే అండర్ వరల్డ్‌తో సంబంధాలున్నాయన్న ఆరోపణలతో 2008లో విధుల నుంచి తొలగించారు. అయితే 2009లో తిరిగి బాధ్యతలు స్వీకరించారు. నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో 2010లో ఆయన్ను అరెస్టు చేశారు. ఆ ఎన్‌కౌంటర్‌లో రామ్‌నారాయణ్ గుప్తా అలియాస్ లఖన్ భయ్యా మృతి చెందాడు. ఈ కేసును విచారించిన న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. నాలుగు సంవత్సరాల శిక్ష అనంతరం 2013లో బయటకు వచ్చారు. 2019లో తన పోలీసు ఉద్యోగానికి రాజీనామా చేసిన ఆయన... ఆ వెంటనే శివసేనలో చేరారు. తర్వాత ఆ పార్టీ తరఫున అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి, ఓటమి చవిచూశారు. ఇదిలా ఉండగా, మూడేళ్ల క్రితం దక్షిణ ముంబైలో ప్రముఖ పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీ ఇంటికి సమీపాన పేలుడు పదార్థాల వాహనాన్ని గుర్తించిన ఘటన సంచలనం సృష్టించింది. ఆ వాహన యజమానిగా చెబుతున్న హిరేన్ మన్‌సుఖ్ శవమై కనిపించారు. ఈ కేసుల విచారణ సమయంలో ప్రదీప్ పేరు వెలుగులోకి వచ్చింది. వీటికి సంబంధించి 2021లో జాతీయ దర్యాప్తు సంస్థ అరెస్టు చేసింది. ఓటీటీ సిరీస్ 'ముంబై మాఫియా... పోలీస్ వర్సెస్ అండర్ వరల్డ్'తో 2023లో ఆయన పేరు మరోసారి తెరపైకి వచ్చింది. శర్మ, ఆయన బృందం ముంబైలో డీ-కంపెనీని ఎలా అణచివేసిందో అందులో చూపించారు. అందులో ప్రదీప్ శర్మ పాత్రలో ఆయనే నటించడం విశేషం. తాజాగా రామ్‌నారాయణ్ గుప్తా ఎన్‌కౌంటర్ కేసులో దోషిగా నిర్ధారించిన బాంబే హైకోర్టు, జీవిత ఖైదు విధిస్తూ తీర్పు ఇచ్చింది. మూడు వారాల్లో లొంగిపోవాలని ఆదేశించింది. అలాగే ప్రదీప్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ 2013లో కింది కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు తప్పు పట్టింది. ఇదే కేసుకు సంబంధించి పోలీసు సిబ్బంది సహా 13 మందికి జీవితఖైదు విధిస్తూ కింది కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. మరో ఆరుగురికి ఆ శిక్షను రద్దు చేసి నిర్దోషులుగా ప్రకటించింది.

చెప్పులు నాకించి, మూత్రం తాగించారు

మధ్యప్రదేశ్‌లో అమానవీయ ఘటన

ఉజ్జయిని: మధ్యప్రదేశ్‌లో ఓ దారుణ ఘటన చోటు చేసుకుంది. ఓ వివాహితతో కలిసి పారిపోయిన వ్యక్తిని విచక్షణారహితంగా కొట్టారు. బలవంతంగా మూత్రం తాగించడంతో పాటు చెప్పులు నాకించారు. మెడలో బూట్ల హారం వేసి ఊరేగించారు. అంతేకాదు... ఈ తతంగాన్ని ఫోన్ లో రికార్డ్ చేసి, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. దీంతో.. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. బాధిత వ్యక్తి ఉజ్జయిని జిల్లా భట్‌పచ్లానా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న భిల్‌ఖేడి గ్రామానికి చెందినవాడు. అతడు స్థానికంగా ఉంటున్న ఓ వివాహిత మహిళను ప్రేమించాడు. ఆమె బంజారా వర్గానికి చెందినది. ఆ మహిళ కూడా అతడ్ని ప్రేమించింది. ఈ క్రమంలో తమ ప్రేమను సమాజం అంగీకరించదని భావించి, ఇద్దరు కలిసి పారిపోయారు. అయితే మహిళ తాలూకు బంధువులు వీరి ఆచూకీ కనుగొని వెనక్కు తీసుకొచ్చారు. తమ వర్గానికి చెందిన మహిళను, అది కూడా వివాహితను తీసుకెళ్తావా? అంటూ బాధితుడ్ని చితక్కొట్టి బలవంతంగా మూత్రం తాగించారు. మెడలో బూట్ల దండ వేశారు. ఒక చెప్పుని అతని తలపై పెట్టి, మరో చెప్పు నాకించారు. సగం మీసం, సగం గుండుతోనూ అతడు వీడియోలో కనిపించాడు. ఇక్కడ దిగ్భ్రాంతి కలిగించే విషయం ఏమిటంటే... అతడు ఏ మహిళతో అయితే పారిపోయాడో, ఆమె కూడా అతడ్ని కొట్టడం వీడియోలో రికార్డ్ అయింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు నెట్టింట్లో వైరల్ అయిన మూడు, నాలుగు రోజుల తర్వాత అవి పోలీసుల కంట పడ్డాయి. దీంతో తాము బాధితుడు ఎక్కడుంటాడో తెలుసుకొని ఆ ప్రాంతానికి వెళ్లామని, అయితే అతడు అక్కడ లేడని అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నితీశ్ భార్గవ తెలిపారు. ఈ ఘటన వెనుక గల కారణాలపై బాధితుడితో మాట్లాడాక నిర్ధారిస్తామని చెప్పారు. ఇప్పటివరకూ దీనిపై బాధితుడు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

వరుణ్ గాంధీకి టికెట్ దక్కేనా?

ఉత్తరప్రదేశ్ సీఎంపై విమర్శలతో సందేహాలు

ఇండిపెండెంట్‌గా బరిలోకి!



న్యూదిల్లీ: లోక్ సభఎన్నికల్లో సిట్టింగ్ స్థానం పిలిభిత్ నుంచి వరుణ్ గాంధీ బరిలోకి దిగుతారా? భారతీయ జనతా పార్టీ మరోసారి టికెట్ ఇస్తోందా? టికెట్ ఇవ్వకుంటే యువనేత వరుణ్ గాంధీ కార్యాచరణ ఎలా ఉండబోతుంది... ఇప్పుడు ఇవే ప్రశ్నలు పిలిభిత్ బీజేపీ శ్రేణుల్లో వినిపిస్తున్నాయి. వరసగా నాలుగోసారి వరుణ్ గాంధీకి టికెట్ దక్కడం ఖాయం అని అతని అనుచరులు ధీమాతో ఉన్నారు. ఒకవేళ టికెట్ లభించకుంటే ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగుతారని చెబుతున్నారు. వివరాల్లోకి వెళితే... సంజయ్ గాంధీ- మేనకా గాంధీల కుమారుడే వరుణ్ గాంధీ. సోనియా గాంధీతో పొసగకపోవడంతో మేనకా గాంధీ కాంగ్రెస్ పార్టీని వీడారు. కుమారుడితో పాటు బీజేపీలో చేరారు. పిలిభిత్ లోక్‌సభ నుంచి వరుణ్ గాంధీ వరసగా మూడుసార్లు బరిలోకి దిగారు. ఈ సారి టికెట్ దక్కడం కష్టమేనని తెలుస్తోంది. పార్టీ... ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిపై వరుణ్ గాంధీ చేసిన కామెంట్ల వల్ల టికెట్ దక్కడంపై సందేహాలు తలెత్తాయి. గత ఏడాది వరుణ్ గాంధీ యోగి ఆదిత్యనాథ్‌పై విమర్శలు చేశారు. 'రాష్ట్రంలో సాధువుకు ఆటంకం కలిగించొద్దు. మహారాజ్ జీ ముఖ్యమంత్రి అవుతారో ఎవరికీ తెలియదు. అమేథీలో గల సంజయ్ గాంధీ ఆస్పత్రిలో 2023 సెప్టెంబరులో రోగి మరణించాడు. ఆసుపత్రి లైసెన్స్‌ను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సస్పెండ్ చేసింది' అని యోగి ఆదిత్యనాథ్ సర్కార్ తీరును వరుణ్ గాంధీ తప్పుపట్టారు. సొంత ప్రభుత్వంపై వరుణ్ గాంధీ చేసిన వ్యాఖ్యలతో ఉత్తరప్రదేశ్ బీజేపీ నేతలు గుర్రుగా ఉన్నారు. ఈ సారి ఆయనకు టికెట్ ఇవ్వొద్దని స్పష్టం చేశారు. వరుణ్‌కు టికెట్ ఇచ్చే అంశం హైకమాండ్ చేతిలో ఉంది. టికెట్ రాకుంటే స్వతంత్ర అభ్యర్థిగా వరుణ్ బరిలోకి దిగుతారని అతని సన్నిహితులు అంటున్నారు.

కృత్రిమ మేధలో ప్రపంచానికి భారత్ నాయకత్వం

ప్రధాని మోదీ

న్యూదిల్లీ : కృత్రిమ మేధ (ఏఐ) సామర్థ్యాలలో భారతదేశం ప్రపంచానికి నాయకత్వం వహిస్తుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బుధవారం అన్నారు. ప్రపంచవ్యాప్తంగా దేశాలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి 'గ్లోబల్ అప్లికేషన్‌ల కోసం భారతీయ పరిష్కారాలు' పై పని చేయాలని యువ పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌లను ప్రోత్సహించారు. స్టార్టప్ మహాకుంభ్‌ను ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం ప్రారంభించిన ఏఐ, సెమీకండక్టర్స్, క్వాంటమ్‌పై మూడు మిషన్లు యువతకు ఉద్యోగాలు, ప్రపంచ పెట్టుబడిదారులకు పెట్టుబడి అవకాశాలను సృష్టిస్తాయని తెలిపారు. 'మనం కృత్రిమ మేధ సాంకేతికతకు చెందిన కొత్త యుగంలో ఉన్నాం. కృత్రిమ మేథలో భారతదేశం పైచేయి సాధిస్తుందని ప్రపంచం గుర్తించింది. ఈ అవకాశాన్ని మనం వదులుకోకుండా చూసుకోవడం ఇప్పుడు మన ప్రాధాన్యత' అని అన్నారు. ఏఐ యువ ఆవిష్కర్తలు, ప్రపంచ పెట్టుబడిదారులకు అపరిమితమైన అవకాశాలను అందిస్తుందని చెప్పారు. ఏఐ సామర్థ్యాల నాయకత్వం భారతదేశం చేతుల్లోనే ఉంటుంది. అలాగే ఉండాలి. 'గ్లోబల్ అప్లికేషన్స్ కోసం భారతీయ పరిష్కారాల' స్ఫూర్తి ఒక శక్తిగా ఉంటుందని నేను విశ్వసిస్తున్నాను. భారతీయ ఆవిష్కర్తల పరిష్కారాలు అనేక దేశాల సమస్యలను పరిష్కరిస్తాయి' అని మోదీ అన్నారు. ఏఐలో భారత్ అగ్రగామిగా కొనసాగుతుందని గత ఏడాది అమెరికా సెనేట్‌లో ప్రసంగించిన విషయాన్ని మోదీ గుర్తు చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల తర్వాత తమ ప్రభుత్వం పూర్తి బడ్జెట్‌తో వస్తుందని ప్రధాని విశ్వాసం వ్యక్తం చేశారు. 'దేశం వేల కోట్ల పెట్టుబడితో జాతీయ పరిశోధనా ఫౌండేషన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మధ్యంతర బడ్జెట్‌లో పరిశోధన, ఆవిష్కరణల కోసం లక్ష కోట్ల రూపాయల నిధిని ప్రకటించారు. సూర్యోదయ రంగాల్లో దీర్ఘకాలిక పరిశోధనలకు ఇది దోహదపడుతుంది' అని ప్రధాని అన్నారు. 2014లో 100 స్టార్టప్‌లు కూడా లేవని, ప్రస్తుతం దేశంలో దాదాపు 1.25 లక్షల స్టార్టప్‌లు ఉన్నాయని అన్నారు. 'సుమారు 12 లక్షల మంది యువత వారితో నేరుగా అనుసంధానమయ్యారు. మన వద్ద 110కి పైగా యునికార్న్‌లు ఉన్నాయి.

మన స్టార్టప్‌లు 12,000 పేటెంట్‌లను దాఖలు చేశాయి' అని మోదీ తెలిపారు. తాను ఎన్నికల ప్రచారానికి ఏఐ టెక్నాలజీని ఉపయోగిస్తున్నానని, తమిళం, తెలుగు, ఇతర భాషల్లో తన ప్రకటనలను పంచుకుంటున్నానని ప్రధాని చెప్పారు. భారతదేశంలో యువత ఇప్పుడు ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగ సృష్టికర్తలుగా మారుతున్నారని అన్నారు. యూపీఐ ద్వారా ఆర్థిక స్టార్టప్‌లు చాలా లాభపడ్డాయని, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వల్ల ఆర్థిక సమ్మేళనం బలపడుతుందని ప్రధాని పేర్కొన్నారు. 'దేశం గ్రామీణ, పట్టణ విభజనను తగ్గించగలిగింది. ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ పురోగతి ప్రారంభమైనప్పుడు ఆందోళనలు ఉన్నాయి. సామాజిక విభేదాల గురించి చర్చలు జరిగాయి. భారతదేశం సాంకేతికతను ప్రజాస్వామ్యబద్ధం చేసింది. అందువల్ల ప్రతిఒక్కరికీ అన్నీ ఉన్నాయి' అని మోదీ అన్నారు. 45 శాతానికి పైగా స్టార్టప్‌లకు మహిళలే నాయకత్వం వహిస్తున్నారని, వికసిత్ భారత్‌కు మాత్రమే కాకుండా ప్రపంచంలోని మంచి భవిష్యత్తుకు కూడా ఆవిష్కరణ సంస్కృతి ముఖ్యమని ఆయన తెలిపారు.

యూపీలో చిన్నారుల దారుణ హత్య

- డబ్బు కోసం వారి ఇంటికెళ్లి ఘాతుకం
- పోలీసు కాల్పుల్లో నిందితుడు హతం

బుదౌన్ : ఉత్తర ప్రదేశ్‌కు చెందిన బుదౌన్‌లో ఇద్దరు చిన్నారులు దారుణ హత్యకు గురయ్యారు. మరొక బాలుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. నిందితుడు స్థానిక నివాసితులైన సంగీత, వినోద్ కుమార్ ఇంటికి వెళ్లి గర్భవతి అయిన తన భార్య ప్రసవానికి డబ్బులు కావాలని కోరాడని, హత్య చేసిన వ్యక్తి ఆ కుటుంబానికి తెలుసునని ఎఫ్ఐఆర్ పేర్కొంది. హత్య జరిగిన కొన్ని గంటల తర్వాత నిందితుడు సాజిద్ (22) పోలీసులతో జరిగిన న్‌కౌంటర్‌లో హతమయ్యాడని బరేలీ రేంజ్ ఐజీ ఆర్.కె.సింగ్ బుధవారం పీటీఐకి తెలిపారు. ఇటీవలే స్థానికంగా ఒక సెలూన్ దుకాణం ప్రారంభించిన సాజిద్... సంగీత, వినోద్ కుమార్‌ల ఇంట్లోకి ప్రవేశించి వారి ముగ్గురు కుమారులు ఆయుష్ (12), అహాన్ అలియాస్ హనీ (8), యువరాజ్ (10) పై కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో ఆయుష్, అహాన్ మరణించగా, తీవ్రంగా గాయపడిన యువరాజ్‌ను ఆస్పత్రికి తరలించారు. మృతుల తండ్రి వినోద్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, నిందితుడు సాజిద్, అతని సోదరుడు జావేద్ మంగళవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో ఇంటికి చేరుకున్నారు. 'తన భార్య ప్రసవానికి రూ.5 వేలు అవసరమని సాజిద్ నా భార్య సంగీతకు చెప్పాడు. డబ్బు తీసుకోవడానికి నా భార్య లోపలికి వెళ్లగా, సాజిద్ ఇంటి పైకి వెళ్లి నా ఇద్దరు కుమారులు ఆయుష్, అహాన్ అలియాస్ హనీని పిలిచాడు. ఆ వెంటనే ఆ ముగ్గురు చిన్నారులపై పదునైన కత్తితో దాడి చేశాడు. నా భార్య డబ్బుతో బయటకు వచ్చినప్పుడు సాజిద్, జావేద్ కత్తితో మెట్లు దిగడం, దుస్తులు రక్తంతో తడిసి ఉండటాన్ని చూసింది. నా భార్యను చూసి వారు 'ఈ రోజు మా పని చేశాము' అని చెప్పి అక్కడి నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించారు' అని ఎఫ్ఐఆర్ పేర్కొంది. అయితే నీళ్ల కోసం పైకి వెళ్లిన మూడో కుమారుడు యువరాజ్‌పై కూడా నిందితులు దాడి చేశారు. యువరాజ్ ఆస్పత్రిలో చేరాడు. అతని పరిస్థితి నిలకడగా ఉంది. ప్రైవేట్ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్న మృతుడి తండ్రి ఘటన జరిగిన సమయంలో జిల్లా బయట ఉన్నాడు. అతని భార్య సంగీతతో పాటు ఆమె తల్లి ఇంటిలో ఉన్నారు. జావేద్ ఆచూకీపై పోలీసులు స్పష్టత ఇవ్వలేదు. ఈ ఘటన వెనుక గల కారణాలను కూడా పోలీసులు ధ్రువీకరించలేదు. ఎఫ్ఐఆర్‌లో పోలీసులు జావేద్, సాజిద్‌పై హత్య (ఐపీసీ సెక్షన్ 302 కింద) కేసు నమోదు చేశారు. భిన్న వర్గాల వ్యక్తులకు సంబంధించిన కేసు కావడంతో ఆ ప్రాంతంలో భారీగా పోలీసు బలగాలను మోహరించారు.

మళ్లీ బీజేపీలో చేరిన తమిళిసై



చెన్నై: తెలంగాణ, పుదుచ్చేరి మాజీ గవర్నర్ తమిళి సౌందరరాజన్ బీజేపీలో చేరారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు అన్నామలై ఆధ్వర్యంలో ఆమె బీజేపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా తమిళిసైకి వీరు బీజేపీలోకి సాదర స్వాగతం పలికారు. పుదుచ్చేరి గవర్నర్‌గా వ్యవహరించిన తమిళిసై... ఇటీవల తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయనున్న నేపథ్యంలో గవర్నర్ పదవికి రాజీనామా చేసిన ఆమె... మళ్లీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రవేశించారు. రాజ్యాంగబద్ధమైన గవర్నర్ పదవి చేపట్టాలంటే ఏ రాజకీయ పార్టీలోనూ సభ్యత్వం కలిగి ఉండరాదు. అందుకే... గవర్నర్ పదవికి ముందుకు ఆమె ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకున్నారు. ఈసారి ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్న తమిళిసై... గవర్నర్ పదవికి రాజీనామా చేసి మళ్లీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రవేశించారు. తన సొంత పార్టీ అయిన బీజేపీలోకే పునరాగమనం చేశారు. తమిళనాడులోని చెన్నై సెంట్రల్ లేదా తూత్తుకుడి ఎంపీ స్థానం నుంచి తమిళిసై పోటీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

పశుపతి పరాస్ రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం

న్యూదిల్లీ: బీహార్‌లో సీట్ల పంపకాల్లో తమ పార్టీకి బీజేపీ అన్యాయం చేసిందని ఆరోపిస్తూ కేంద్రమంత్రి పదవికి రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ అధ్యక్షుడు పశుపతి కుమార్ పరాస్ చేసిన రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం ఆమోదించారు. ఈ మేరకు రాష్ట్రపతి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్రమంత్రి కిరణ్ రిజిజుకు పరాస్ నిర్వహించిన మంత్రిత్వ శాఖ అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బీహార్‌లో పొత్తులో భాగంగా చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని ఎల్జేపీ (రాంవిలాస్) పార్టీకి ఎన్డీయే ఐదు సీట్లు కేటాయించింది. దీనిపై పశుపతి పరాస్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ గొప్ప నేత. ఆయనకు నేను ఎప్పటికీ రుణపడి ఉంటా. కానీ, బీహార్‌లో ఎన్డీయే భాగస్వామ్య పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు విషయంలో మాకు అన్యాయం జరిగింది. మా పార్టీకి ఐదుగురు ఎంపీలు ఉన్నా... పొత్తులో మాకు ఒక్క సీటు కూడా ఇవ్వలేదు. అందుకే కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేస్తున్నానని పరాస్ పేర్కొన్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఆయనను బీహార్‌లోని ప్రతిపక్ష కూటమికి ఆర్జేడీ ఆహ్వానించింది. ఒకవేళ పశుపతి పరాస్ ప్రతిపక్ష కూటమిలోకి రావాలనుకుంటే.. తాము స్వాగతం చెప్పడానికి సిద్ధమేనని ఆర్జేడీ నేత తేజ్‌ప్రతాప్ యాదవ్ అన్నారు.

ఎన్నికల వేళ... ప్రత్యర్థులపై నిఘా

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో దేశవ్యాప్తంగా రాజకీయ వేడి రాజుకుంది. ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థులు, టికెట్లు కోరుతున్న ఆశావహులు... వారి ప్రత్యర్థులు, సహచరుల కదలికలపై దృష్టి పెడుతున్నారు. మరోవైపు రాజకీయ పార్టీలు కూడా ఇతర పార్టీల వ్యూహాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇందుకోసం ప్రైవేటు వ్యక్తులను నియమించుకుంటున్నాయి. దీంతో ప్రైవేటు డిటెక్టివ్ ఏజెన్సీలకు భారీ గిరాకీ పెరుగుతున్నది. రాజకీయ ఫిరాయింపులు, క్యాంపులు మార్చడం వంటి వ్యవహారాలతో కీలక సమాచారాన్ని ప్రత్యర్థులకు అందించే అవకాశం ఉన్న వారిపై నిఘా ఉంచే పనిని డిటెక్టివ్ ఏజెన్సీలకు రాజకీయ పార్టీలు అప్పగిస్తున్నాయి. అంతేకాకుండా రాబోయే రోజుల్లో ఎవరు పార్టీలు మారే అవకాశం ఉందనే విషయాన్ని గుర్తించడం కూడా ఈ ఏజెన్సీల పని. అనుకూలమైన ఫలితాలు రాబట్టేందుకు ఎంత ఖర్చుచేసేందుకైనా రాజకీయ పార్టీలు వెనకాడటం లేదని నిఘా సంస్థలు చెబుతున్నాయి. ప్రత్యర్థుల అవినీతి, నేరచరిత్ర, కుంభకోణాలు, అక్రమ సంబంధాలు, వీడియో సంబంధిత సమాచారం, అనుసరించాల్సిన వ్యూహాలే ప్రధాన అంశాలుగా డిటెక్టివ్‌లను నియమించుకుంటున్నారు. ప్రత్యర్థులతో తమ సహాయకులు, సిబ్బంది కుమ్మక్కు అవుతున్నారా అనే విషయాన్ని ముందుగానే పసిగట్టేందుకు రాజకీయ నాయకులు, అభ్యర్థులు ఆసక్తి చూపుతున్నారు. అభ్యర్థుల జాబితాలో పేర్లు లేకపోవడంతో నిరాశకు గురైన వారితోపాటు సీటు పొందిన వారు తమ ప్రత్యర్థుల బలాలు తెలుసుకునేందుకు డిటెక్టివ్‌లను సంప్రదిస్తున్నట్లు దిల్లీ కేంద్రంగా పనిచేసే జీడీఎక్స్ డిటెక్టివ్స్ లిమిటెడ్ ఎండీ మహేశ్ చంద్ర శర్మ పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ నిఘా చాలాకాలంగా ఉందన్నారు. ఎన్నికల తేదీలు ప్రకటించడానికి కొన్ని నెలల ముందు నుంచే రాజకీయ పార్టీలు వీరిని నియమించుకున్నట్లు సిటీ ఇంటెలిజెన్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ఎండీ రాజీవ్ కుమార్ చెప్పారు. కేవలం ప్రత్యర్థుల సమాచారమే కాకుండా అభ్యర్థుల బలాలు, ఎన్నికల్లో విజయం సాధిస్తే పదవులు నిర్వర్తించే సామర్థ్యాలపైనా నివేదికలు రూపొందించాలని కోరుతున్నట్లు చెప్పారు. మరోవైపు, అభ్యర్థులే కాకుండా పార్టీలకు నగదు, మద్యం ఎక్కడ నుంచి వస్తోంది? వాటిని ఎక్కడ నిల్వ చేస్తున్నారు? పంపిణీ చేసేందుకు ఎటువంటి పద్ధతులు అనుసరిస్తున్నారు? వంటివి కనిపెట్టే పనులను డిటెక్టివ్‌లకు అప్పగిస్తున్నట్లు రాజీవ్‌కుమార్ వెల్లడించారు. ప్రత్యర్థుల ప్రజాదరణతో పోలిస్తే తమ అభ్యర్థి బలాబలాలు, రాజకీయాల్లో కొత్త ముఖాలను దించే అంశంపైనా తమను సంప్రదిస్తున్నారని దిల్లీ కేంద్రంగా పనిచేసే మరో డిటెక్టివ్ ఏజెన్సీ ఎండీ నమాన్ జైన్ తెలిపారు. సమగ్ర సర్వేల ద్వారా ఎన్నికల ఫలితాలను అంచనా వేయడం మరో ముఖ్య అంశమన్నారు. ఇలా ఎన్నికల ప్రచార సమయంలో డిటెక్టివ్‌ల పాత్ర ఇటీవల గణనీయంగా పెరిగిందని చెప్పారు.

లడాఖ్‌కు రాష్ట్ర హోదా ఇవ్వాల్సిందే

- రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో చేర్చాలి
- కార్గిల్ డిమాండ్ - వేలాది మందితో నిరసన ప్రదర్శన
- దుకాణాలు, వ్యాపార సముదాయాల మూత
- హక్కుల సాధనకు పోరు ఉధృతం చేస్తాం: కేడీఏ
- 15వ రోజుకు వాంగ్‌చుక్ దీక్ష

లడాఖ్: లడాఖ్‌కు రాష్ట్ర హోదా, రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో చేర్పింపు కోసం డిమాండ్ చేస్తూ కార్గిల్‌లో వేలాది మంది కదం తొక్కారు. ఈ మార్చ్‌కు మద్దతుగా బుధవారం దుకాణాలు, వ్యాపార సముదాయాలను మూసివేశారు. హక్కులు సాధించుకునే వరకు వెనక్కి తగ్గేది లేదని కార్గిల్ డెమొక్రటిక్ అలయెన్స్ (కేడీఏ) నాయకులు నొక్కిచెప్పారు. కేంద్రంతో అనేక దఫాలు జరిపిన చర్చలు ఎలాంటి ఫలితాలివ్వలేదని, ప్రభుత్వ ప్రతినిధులు తమతో దురుసుగా, నిర్లక్ష్యంగా ప్రవర్తించారని, అధికార బలంతో లడాఖ్ ప్రజలను తొక్కేయవచ్చని వారు భావిస్తున్నారని, ఎట్టిపరిస్థితుల్లో అలా జరగనివ్వబోమని ఉద్ఘాటించారు. రాబోయే రోజుల్లో డిమాండ్ల సాధన కోసం పోరు ఉధృతం చేస్తామని కేంద్రాన్ని హెచ్చరించారు. దీర్ఘకాల పోరునకు సమాయత్తం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మరోవైపు లేహ్‌లో పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్ష 15వ రోజుకు చేరుకుంది. కేంద్ర పాలిత ప్రాంత బలహీన పర్యావరణ పరిస్థితిని, ప్రాంతీయ గిరిజన ఆచారాల సంరక్షణకు ఇచ్చిన హామీని కేంద్రానికి గుర్తుచేసే లక్ష్యంతోనే ఈ దీక్ష జరుగుతోంది.

కార్గిల్ డెమొక్రటిక్ అలయెన్స్ (కేడీఏ) పిలుపు మేరకు వాంగ్‌చుక్‌కు సంఘీభావంగా కార్గిల్‌లో ర్యాలీ జరిగింది. ఫాతిమా చౌక్ నుంచి హుస్సేనీ పార్క్ వరకు మెయిన్ మార్కెట్ మీదుగా నిరసనకారులు ప్రదర్శన నిర్వహించారు. లడాఖ్‌కు రాష్ట్ర హోదా, రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో చేర్పింపునకు డిమాండ్ చేశారు. 'సేవ్ లడాఖ్, సేవ్ డెమొక్రసీ' బ్యానర్లు ప్రదర్శించారు. హుస్సేనీ పార్కు వద్ద ర్యాలీనుద్దేశించి కేడీఏ నాయకులు ప్రసంగించారు. కేంద్రంతో చర్చలు విఫలమైన నేపథ్యంలో సుదీర్ఘపోరుకు సిద్ధం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈనెల 24 నుంచి కార్గిల్‌లో నిరాహార దీక్ష మొదలవుతుందని ప్రకటించారు. 'నాలుగేళ్లుగా చేస్తున్న మా డిమాండ్ల సాధనే లక్ష్యంగా ముందుకెళుతున్నాం. మార్చి 4న కేంద్రంతో జనాంతిక సమావేశం జరిగినప్పుడు ప్రధాన డిమాండ్లకు చర్చల ద్వారా తీర్మానానికి యత్నించగా వాటిని కేంద్రప్రభుత్వ ప్రతినిధులు తిరస్కరించారు. దీంతో వీధి పోరాటం అనివార్యమైంద'ని కేడీఏ సహ చైర్మన్ అజ్గర్ అలీ కర్బలై తెలిపారు. కేడీఏ నాయకులు గురువారం ఏబీఎల్ నేతలతో భేటీ అయి ఉద్యమ భవిష్యత్ కార్యాచరణను నిర్ణయిస్తారని వెల్లడించారు. 'మేము ఐక్యంగా ఉన్నాం. కార్గిల్ ప్రజలు ఈ పోరాటంలో అగ్రభాగాన నిలుస్తారు' అని ఆయనన్నారు. వాంగ్‌చుక్ మాట్లాడుతూ లవణాలు, మంచినీళ్లతో మనుగడ సాగిస్తానని చెప్పారు. తనతో పాటు 125 మంది దీక్షలో పాల్గొంటున్నారని, ఖాళీ కడుపులతో మైనస్ 11 డిగ్రీల చలిలో ఆరు బయట నిద్రిస్తున్నారన్నారు. లడాఖ్ మంచు పర్వతాలను పరిరక్షించుకోవడం కేవలం లడాఖ్ ప్రజలకే ముఖ్యం కాదన్న విషయాన్ని గ్రహించాలని 'ఎక్స్'లో పేర్కొన్నారు. లడాఖ్ ప్రజలకు సీపీఎం నాయకుడు మహమ్మద్ యూసుఫ్ తారిగమీ సంఘీభావం తెలిపారు. 'జమ్మూకశ్మీర్ నుంచి లడాఖ్ వేరు కావాలని మేమెప్పుడు కోరుకోలేదు కానీ మా ఆంక్షలకు విరుద్ధంగా అది జరిగింది. లేహ్‌లో ఓ వర్గం లడాఖ్‌కు కేంద్రపాలిత ప్రాంత హోదాను డిమాండ్ చేసింది... అది వచ్చాక సంబరాలు చేసుకున్నది. ఇప్పుడు వారికి దాని లోపాలు తెలిసివచ్చాయి' అని తారిగమీ ఓ ప్రకటన చేశారు.

జగన్ కుట్రలను అడ్డుకోండి: చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పూర్తిస్థాయిలో జనం నమ్మకం, మద్దతు కోల్పోయిన జగన్... ఎన్నికల్లో అక్రమాలను చివరి అస్త్రంగా ఎంచుకున్నాడని, వాటిని ప్రజలు తిప్పికొట్టాలని టీడీపీ అధినేత చంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన వైసీపీని ఇంటికి పంపేందుకు ఇప్పుడు రాష్ట్ర పౌరులు బాధ్యత తీసుకుని ముందడుగు వేయాలని కోరారు. ఎన్నికల నిబంధనలు సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. డబ్బు పంపిణీ, ఓటర్లను ప్రలోభ పెట్టడం, ప్రభుత్వ ఉద్యోగులతో నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయించడం, ప్రత్యర్థి పార్టీలపై తప్పుడు ప్రచారం చేయడం వంటి వివిధ కోడ్ ఉల్లంఘనలపై సి-విజిల్ అనే యాప్ ద్వారా ప్రజలే నేరుగా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజలు తమ దృష్టికి వచ్చిన ప్రతి తప్పును సి-విజిల్ యాప్ ద్వారా అత్యంత సులభంగా ఈసీ దృష్టికి తీసుకువెళ్లే అవకాశం ఉందని, దానిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తద్వారా ప్రజలు కూడా పారదర్శక ఎన్నికల నిర్వహణకు తమ వంతుగా కృషి చేసినట్లు అవుతుందన్నారు. పౌరులు నేరుగా సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే ఈసీ వెంటనే తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, ఈ కారణంగా వెంటనే ఈ యాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని పిలుపునిచ్చారు. అధికార పార్టీ అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి ఇప్పటికే టీడీపీ, బీజేపీ, జనసేన పోరాటం చేస్తున్నాయని, ఈ పోరాటంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలన్నదే తమ అభిమతమన్నారు. ప్రజల భాగస్వామ్యం ఉంటే ఎన్నికల్లో అక్రమాలను మరింత సమర్థవంతంగా అరికట్టవచ్చని చంద్రబాబు పేర్కొన్నారు. ముఖ్యంగా జగన్ రెడ్డి రివర్స్ పాలనతో రాష్ట్రంలో ఎక్కువ నష్టపోయింది యువతే అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. యువత తమ భవిష్యత్ కోసం సమర్థవంతమైన నాయత్వాన్ని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఏప్రిల్ 15 వరకు అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రాక్షస పాలన అంతంలో ప్రతి ఓటూ... ప్రతి సీటూ కీలకమని... యువత తమ ఆకాంక్షలను నెరవేర్చుకునేందుకు ఓటు నమోదు చేసుకుని మంచి చేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని చంద్రబాబు కోరారు.

యూసీసీని బీజేపీ విడవబోదు

- యూపీలో అత్యధిక స్థానాలు గెలుస్తాం
- హోంమంత్రి అమిత్‌షా

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో అత్యధిక సంఖ్యలో లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకోబోతున్నామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. 2014 కంటే ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో బీజేపీకి ఎక్కువ సీట్లు వస్తాయని, అన్ని వారసత్వ పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని చెప్పుకొచ్చారు. లౌకిక దేశంలో ప్రజలందరికీ ఒకే చట్టం ఉండాలని విశ్వసిస్తున్నందున ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) బీజేపీ ఎజెండాగా ఉంటుందన్నారు. న్యూస్18 రైజింగ్ భారత్ సమ్మిట్‌లో మాట్లాడుతూ షా ఈ వ్యాఖ్యలు చేశారు. 2014లో ఉత్తరప్రదేశ్‌లో మొత్తం 80 సీట్లలో బీజేపీ 71 సీట్లు గెలుచుకోగా, దాని మిత్రపక్షం అప్నాదళ్‌కి రెండు సీట్లు వచ్చాయి. 2019లో బీజేపీకి 62 సీట్లు రాగా, దాని మిత్రపక్షం రెండు సీట్లు గెలుచుకుంది. ఒడిశాలో అధికార బిజూ జనతాదళ్ (బీజేడీ)తో సీట్ల సర్దుబాటు జరుగుతున్న చర్చల గురించి ప్రశ్నించగా... దానిపై తమ పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా తుది నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. 'మేము ఇంకా నిర్ణయం తీసుకోలేదు. మా పార్టీ అధ్యక్షుడు నిర్ణయిస్తారు. కానీ ఒడిశాలో మేము భారీ విజయాన్ని సాధించడం ఖాయం' అని షా చెప్పుకొచ్చారు. ఒంటరిగా పోటీ చేసేటట్లయితే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికే పోరాడతామన్నారు. లోక్‌సభ ఎన్నికలతో పాటు ఒడిశాలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సంగతి విదితమే. పంజాబ్‌లో శిరోమణి అకాలీదళ్‌తో పొత్తుపై వచ్చే రెండు మూడు రోజుల్లో స్పష్టత వస్తుందని షా చెప్పారు. 'చర్చలు కొనసాగుతున్నాయి. ఎన్డీయే పార్టీలన్నీ ఏకతాటిపైకి రావాలని మేము కోరుకుంటున్నాము' అన్నారు. బీహార్‌లో బీజేపీ తన మిత్రపక్షాల కంటే ఎక్కువ సీట్లతో 'బిగ్ బ్రదర్' (పెద్దన్న)గా లోక్‌సభ ఎన్నికల్లో పోరాడబోతుండటం ఇదే తొలిసారి అని షా అన్నారు. పొత్తు ప్రకారం బీహార్‌లో మొత్తం 40 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ 17, జెడీయూ 16, చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని ఎల్‌జేపీ (రామ్ విలాస్) ఐదు స్థానాలు, హిందుస్తానీ అవామ్ మోర్చా, రాష్ట్రీయ లోక్ మోర్చా ఒక్కో సీటులో పోటీచేయబోతున్నాయి.

ఏప్రిల్ 27న పాలిసెట్ యథాతథం

- అదేనెల 18 నుంచి పాలిటెక్నిక్ పరీక్షలు
- కమిషనర్ చదలవాడ నాగరాణి వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పాలిసెట్-2024 ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 27న యథాతథంగా నిర్వహించనున్నట్లు సాంకేతిక విద్య శాఖ కమిషనర్, రాష్ట్ర సాంకేతిక విద్యా, శిక్షణ సంస్థ చైర్మన్ చదలవాడ నాగరాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్ (సీ20) 4,5 సెమిస్టర్ల పరీక్షలు ఏప్రిల్18 నుంచి ప్రారంభమవుతాయి. పరీక్షల షెడ్యూల్‌ను అనుసరించి సీ20, సీ16/ఇఆర్-91/ఇఆర్-20 స్కీమ్‌లకు సంబంధించిన సప్లిమెంటరీ పరీక్షలన్నీ అదే తేదీన మొదలవుతాయని తెలిపారు. అపరాధ రుసుము లేకుండా పరీక్ష ఫీజు చెల్లించడానికి ఆఖరు తేదీ మార్చి 26గా పేర్కొన్నారు. సీ23 మొదటి సంవత్సర పరీక్షలు మే 2 నుంచి ప్రారంభమవుతాయన్నారు. సీ23 మొదటి సంవత్సర పరీక్షల నోటిఫికేషన్ కూడా విడుదలైనట్లు తెలిపారు. పరీక్షల వివరాలన్నీ సాంకేతిక విద్యాశాఖ వెబ్‌సైట్లలో ఉన్నట్లు నాగరాణి వెల్లడించారు.

ఏపీలో ఎన్డీయే కూటమికే మద్దతు: జేపీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ (ఎన్డీయే) కూటమికి మద్దతిస్తున్నట్టు లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ (జేపీ) తెలిపారు. విజయవాడలో బుధవారం ఆయన మాట్లాడుతూ, ఎన్డీయే కూటమితో కలిసి ఎన్నికల బరిలోకి దిగుతామని చెప్పారు. ఏపీలో రాజకీయ పరిస్థితులు దిగజారాయన్నారు. కులాల మధ్య పోరాటం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పులు తెచ్చి సంక్షేమం కోసం ఖర్చు చేయడం సరికాదన్నారు. సంక్షేమమే పాలన అనుకుంటే దేశం, రాష్ట్రం అథోగతి పాలు కావడం ఖాయం అని హెచ్చరించారు. అభివృద్ధి అంటే దీర్ఘకాలిక సంపద సృష్టించడం అని వివరించారు. ఉపాధి కల్పించి, పెట్టుబడులు అందజేసి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అధికారంలో ఉన్న వారు నియంతలా వ్యవహరిస్తున్నారని జేపీ మండిపడ్డారు. ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి ప్రజలదేనని, మన డబ్బు మన హక్కు అన్న విషయం ప్రజలు గుర్తెరగాలన్నారు. దేశానికి, ప్రజలకు మంచి జరగాలంటే ఆర్థిక ప్రగతి అవసరమని స్పష్టం చేశారు. గత ఐదేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రగతి మాట లేకుండా పోయింది. నిర్భయంగా నమ్మిన వారికి ఓటు వేయాలని జేపీ కోరారు.

రాహుల్ 'శక్తి' వ్యాఖ్యలపై ఈసీకి బీజేపీ ఫిర్యాదు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఎన్నికల సంఘానికి బీజేపీ బుధవారం ఫిర్యాదు చేసింది. 'శక్తి' వ్యాఖ్యలతో మతపరమైన మనోభావాలను కించపరిచారంటూ ఆరోపించింది. న్యూఢిల్లీలోని ఈసీ కార్యాలయానికి వెళ్లి అధికారులతో కేంద్ర మంత్రి హరదీప్ సింగ్ పూరి కలిశారు. రాహుల్ మాట్లాడిన మాటలను చదివి వినిపించారు. అనేకమంది ప్రజల మతపరమైన మనోభావాలను, నారీశక్తిని రాహుల్ అవమానించారన్నారు. భారత్ జోడో న్యాయ యాత్రలో భాగంగా ముంబైలో రాహుల్ మాట్లాడుతూ 'హిందూ మతంలో శక్తి అనే పదం ఉంది. మనం ఓ శక్తిపై పోరాడుతున్నాం. ఆ శక్తి ఏమిటన్నదే ప్రశ్న. రాజు ప్రాణం ఈవీఎంలో ఉంది. ఇదే నిజం. రాజు ప్రాణం ఈవీఎంలో, ఈడీ, సీబీఐ, ఐటీ శాఖలో, దేశంలోని ప్రతి వ్యవస్థలో ఉంది' అని వ్యాఖ్యానించారు. ఓటింగ్ యంత్రాలు లేకుండా మోదీ గెలవలేరని రాహుల్ అన్నారు. ఈ వ్యాఖ్యలను బీజేపీ ఖండించింది. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని ఆరోపించింది. 'హిందూ మతంలో దుర్గాదేవిని శక్తిగా వ్యవహరిస్తారని, దైవాన్ని దూషించి ప్రజల మత భావాలను, మతాన్ని రాహుల్ కించపరిచారని వ్యాఖ్యానించింది. శక్తి అనే పదం దేవతలకు, మహిళలకు సంబంధించిందని, వారిని అవమానించేలా, సామరస్యానికి భంగం కలిగించేలా, స్వేచ్ఛ, పారదర్శక ఎన్నికలకు ముప్పు కలిగించేలా రాహుల్, కాంగ్రెస్ వైఖరి ఉందని పేర్కొంది. కాంగ్రెస్, రాహుల్‌పై చర్యలు తీసుకోవాలని తన ఫిర్యాదులో ఈసీని బీజేపీ కోరింది.

పాట్నా హైకోర్టుకు జస్టిస్ చండేల్ బదిలీ

సుప్రీం కొలీజియం సిఫార్సు



న్యూఢిల్లీ: చత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయమూర్తి అరవింద్ సింగ్ చండేల్‌ను పాట్నా హైకోర్టుకు బదిలీ చేయాలని సీజేఐ చంద్రచూడ్ నేతృత్వ సుప్రీంకోర్టు కొలీజియం బుధవారం సిఫార్సు చేసింది. జస్టిస్ చండేల్‌ను మద్రాసు హైకోర్టుకు బదిలీ చేయాలని కొలీజియం ఈనెల 15న సూచించింది. దీనిపై జస్టిస్ చండేల్ అభిప్రాయాన్ని కోరింది. ఆయన 17న స్పందించారు. బదిలీ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని... లేదంటే రాజస్థాన్, మధ్యప్రదేశ్, అలహాబాద్, పంజాబ్-హర్యానా లేక దిల్లీ హైకోర్టుల్లో ఏదో ఒక చోటుకు బదిలీ చేయాలని కోరారు. మెమోరాండం ఆఫ్ ప్రొసీజర్ ప్రకారం చత్తీస్‌గఢ్ హైకోర్టు వ్యవహారాలు తెలిసిన సుప్రీంకోర్టు జడ్జిల్లో ఒకరిని కొలీజియం సంప్రదించింది. జడ్జి సూచనలు తీసుకుంది. పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కూడా జస్టిస్ చండేల్ బదిలీని సమర్థించారు. ఈ మేరకు కొలీజియం తెలిపింది. జస్టిస్ అరవింద్ సింగ్ చండేల్ విజ్ఞప్తిని నిశితంగా పరిశీలించామని, ఆయన కోరికను మన్నించలేమని పేర్కొంది. అయితే జస్టిస్ చండేల్ విన్నపం దృష్ట్యా మద్రాసు హైకోర్టుకు బదులు పాట్నా హైకోర్టుకు బదిలీ చేసేలా సిఫార్సు చేస్తున్నట్లు కొలీజియం వెల్లడించింది.

డీఎండీకేతో ఏఐఏడీఎంకే పొత్తు

చెన్నై: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో తమిళనాడులోని ప్రధాన ప్రతిపక్ష పార్టీ ఏఐఏడీఎంకే బుధవారం 'కెప్టెన్' విజయకాంత్ పార్టీ డీఎండీకేతో పొత్తు కుదుర్చుకుంది. సీట్ల సర్దుబాటు చేసుకుంది. ఈ మేరకు ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి ప్రకటించారు. తిరువల్లూరు (ఎస్సీ), సెంట్రల్ చెన్నై, కుడ్డలూరు, తంజావూరు, విరుధునగర్ లోక్‌సభ స్థానాల నుంచి డీఎండీకే పోటీ చేస్తుందని తెలిపారు. ఏఐఏడీఎంకే తమకు సహజ మిత్రపక్షమని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలతా విజయకాంత్ అన్నారు. 2011లో అసెంబ్లీ ఎన్నికల తరహా 'గొప్ప విజయకూటమి' ఏర్పాటైందని వక్కాణించారు. 2026 శాసనసభ ఎన్నికల్లోనూ ఈ పొత్తు కొనసాగుతుందని చెప్పారు. 2011లో ఏఐఏడీఎంకే, డీఎండీకే కలిసి పోటీ చేసి 203 స్థానాలు గెలుచుకున్నాయి. ఏఐఏడీఎంకే 150 స్థానాల్లో గెలవడంతో జయలలిత ముఖ్యమంత్రి అయ్యారు. డీఎండీకే 29 స్థానాలలో విజయం సాధించి అసెంబ్లీలో రెండవ అతిపెద్ద పార్టీగా నిలిచింది. విజయకాంత్ విపక్ష నాయకుడయ్యారు. అప్పట్లో డీఎంకే 23 స్థానాలకు పరిమితమైంది.

అంబేద్కర్ గురుకులాల ప్రవేశ పరీక్షా ఫలితాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో 2024-2025 విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షా ఫలితాలను తాడేపల్లిలోని ప్రధాన కార్యాలయం నుంచి విడుదల చేసినట్లు ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల (ఏపీఎస్ డబ్ల్యుఆర్ఈఐఎస్) సంస్థ కార్యదర్శి రావిరాల మహేశ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 49,993 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా ఈ నెల 10న నిర్వహించిన పరీక్షకు 42,928 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అంబేద్కర్ గురుకులాల్లో బాలికలకు 9,750 సీట్లు, బాలురకు 5,270 సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రతిభ ఆధారంగా ఆయా కేటగిరీల్లో విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించనున్నామని, అభ్యర్థులు తమ ఫలితాలను http://apbragcet.apcfss.in లో పొందగలరని తెలిపారు. ఈ నెల 22న మొదటి దశ ఎంపిక ఆన్‌లైన్ విధానంలో జరుగుతుందని, తదుపరి ఎంపిక ప్రక్రియ మిగిలిన ఖాళీలను అనుసరించి జోన్ల వారీగా నిర్వహిస్తామన్నారు.

అమరవీరుడి స్థూపానికి 'కోడ్' ముసుగు

విశాలాంధ్ర- కారంపూడి: పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేసి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తులకు ప్రజలు ఇచ్చే గౌరవం అమరవీరుల స్థూపం. అయితే ఎన్నికల కోడ్ పేరుతో వాటికే ముసుగు వేసే పరిస్థితి పట్ల ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పేద ప్రజలు పల్నాడు జిల్లా కారంపూడిలోని ఆదినారాయణ కాలనీలో డా॥ కామ్రేడ్ ఆదినారాయణ స్థూపాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా అటువంటి స్థూపానికి తెల్లటి వస్త్రంతో ముసుగు కప్పడం పేద ప్రజల అభిప్రాయానికి వ్యతిరేకమేనన్న విమర్శలు వస్తున్నాయి. రాజకీయ నాయకుల విగ్రహాలకు ఎన్నికల కోడ్ వర్తిస్తుంది. అది కూడా ముఖం కనపడకుండా ముసుగు మాత్రమే వేస్తారు. నిస్వార్థంగా, ఎటువంటి పదవులు ఆశించకుండా పేదప్రజల పక్షాన నిలిచి పోరాటాలు చేసే త్యాగమూర్తిని స్మరించుకునేందుకు ప్రజలు ఏర్పాటు చేసుకున్న అమరవీరుడి స్థూపానికి ముసుగు వేయడం సరికాదని, ప్రజల మనోభావాలను అర్థం చేసుకుని స్థూపానికి వేసిన ముసుగును తొలగించవలసిందిగా ఆదినారాయణ కాలనీ వాసులు కోరుతున్నారు.

జైల్లోనే ఉంచేందుకు వరుస ఛార్జిషీట్లా?

ఈడీ తీరుపై సుప్రీం అసహనం

న్యూఢిల్లీ: మనీ లాండరింగ్ కేసుల్లో విచారణకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అనుసరిస్తోన్న తీరుపై సుప్రీం కోర్టు విచారం వ్యక్తం చేసింది. నిందితులకు డీఫాల్ట్ బెయిల్ నిరాకరించేందుకు వరుసగా అనుబంధ ఛార్జ్‌షీట్లు దాఖలు చేయడాన్ని ప్రశ్నించింది. విచారణ లేకుండా నిందితులను నిరవధికంగా జైల్లోనే ఉంచే ఈ పద్ధతి న్యాయస్థానాన్ని ఇబ్బందికి గురిచేస్తోందని పేర్కొంది. 'విచారణ పూర్తయ్యేంతవరకు నిందితులను అరెస్టు చేయకూడదనేది డీఫాల్ట్ బెయిల్ ముఖ్య ఉద్దేశం. దర్యాప్తు పూర్తయ్యే వరకు విచారణ చేయొద్దని మీరు చెప్పలేరు. అరెస్టు కూడా చేయడానికి వీలులేదు. అనుబంధ ఛార్జిషీట్లు దాఖలు చేస్తూ... విచారణ లేకుండా నిందితులను నిరవధికంగా జైల్లోనే ఉంచలేరు' అని ఈడీ తరపున హాజరయిన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజుకు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం సూచించింది. ఈ కేసులో ఓ వ్యక్తి 18 నెలలపాటు జైల్లోనే ఉన్నాడని, ఇది తమనెంతో ఇబ్బందికి గురిచేస్తోందని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. నిందితుడిని అరెస్టు చేసినప్పుడే విచారణ మొదలు కావాలని స్పష్టం చేసింది. అయితే సుప్రీం కోర్టు ఇలాంటి అభిప్రాయాన్ని గతంలోనూ వ్యక్తం చేసింది. దర్యాప్తు పూర్తిచేయకుండా నిందితుడికి డీఫాల్ట్ బెయిల్ నిరాకరించే ఉద్దేశంతో వరుస ఛార్జిషీట్‌లు దాఖలు చేయడాన్ని తప్పుపట్టింది. ఇదిలాఉంటే, సీఆర్‌పీసీ ప్రకారం, నిర్దేశించిన గడువులోగా అధికారులు దర్యాప్తు పూర్తి చేయకపోయినా లేదా ఛార్జిషీటు దాఖలు చేయని పక్షంలో అరెస్టయిన వ్యక్తి డీఫాల్ట్ బెయిల్ పొందేందుకు అర్హుడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.